RNI NO.TELTEL/2023/12249

# హైదరాబాద్ పల్స్

జాతీయ తెలుగు దినపత్రిక

దేశం ముఖ్యం.... దేశ ప్రజల భద్రత ముఖ్యం.... మతం కాదు...

epaper.hyderabadpulsenews.in




సీఈఓ : కె నవీన్ కుమార్ | ఎడిటర్: డా. రాహుల్ కుమార్ | సంపుటి: 03 | సంచిక : 237 | పేజీలు : 08 | ఆదివారం | 06-09-2026 | వెల :4/-

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD, SANGAREDDY, WARANGAL, MANCHIRYAL, VIJAYWADA, GUNTUR, KURNOOL, TIRUPATI, KADAPA, BENGALURU, MUMBAI, CHENNAI, DELHI.

# 2 ఏళ్లు టైమ్ ఇవ్వండి

- అవాస్తవ ప్రచారాన్ని నమ్మొద్దు : సీఎం రేవంత్ రెడ్డి
- పిల్లల భవిష్యత్తు ఉపాధ్యాయులు చేతిలోనే ఉంటుందన్న సీఎం
- ఇటీవల టీచర్లు ధర్నా చేస్తే బాధ కలిగిందని వ్యాఖ్య
- రెండేళ్ల సమయం ఇస్తే సమస్యలు సామరస్యపూర్వకంగా పరిష్కరిస్తామని హామీ

2



హైదరాబాద్ పల్స్,డెస్క్

తల్లిదండ్రులతో పాటు సమానంగా పిల్లల భవిష్యత్తుకు పునాది వేసేది ఉపాధ్యాయులేనని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. పిల్లల భవిష్యత్తు తరగతి గదిలోని ఉపాధ్యాయుల చేతిలోనే ఉంటుందన్నారు. విద్యాశాఖ జాతీయ సగటులో తెలంగాణ 17వ స్థానానికి చేరుకుందన్న సీఎం, తెలంగాణలో 88 వేల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరారని గుర్తు చేశారు. ఉపాధ్యాయులపై నమ్మకంతోనే ఇది సాధ్యమైందన్నారు. జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా కొడంగల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన ఉపాధ్యాయ వేడుకల్లో సీఎం ఈ మేరకు మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యాశాఖలో అనేక మార్పులు తీసుకువస్తున్నామని సీఎం పేర్కొన్నారు. ఇటీవల ఇందిరా పార్క్ వద్ద ఉపాధ్యాయులు ధర్నా చేస్తే బాధ కలిగిందన్న రేవంత్? రెడ్డి, చాలా కాలం నుంచి పెండింగ్‌లో ఉన్న పదోన్నతులను తాను పూర్తి చేశానన్నారు. టీచర్ల బదిలీల విషయంలో కూడా చాలా జాగ్రత్తగా ఉన్నానని, 315 జీవో ద్వారా చాలా సమస్యలు పరిష్కరించామని తెలిపారు. ప్రతినెల ఒకటో తేదీనే జీతాలు అందిస్తున్నామన్న ముఖ్యమంత్రి, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన వెంటనే పీఆర్సీ సమస్య కూడా పరిష్కరించామని గుర్తు చేశారు.

**2 ఏళ్లు టైమ్ ఇవ్వండి**

ఈ క్రమంలోనే తెలంగాణలో ఒక్క కుటుంబమే రూ. 7.50 లక్షల కోట్లు అప్పు చేసిందన్న సీఎం, 90 రోజుల్లోనే రూ.6 వేల కోట్ల రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందించామన్నారు. విదేశాల్లో ఉన్న విద్యా విధానాన్ని పరిశీలించాలని టీచర్లను విదేశాలకు పంపామని, ఉపాధ్యాయుల సేవలను తక్కువ చేసి చూడాల్సిన అవసరం తమ ప్రభుత్వానికి లేదని స్పష్టం చేశారు. విధ్వంసం నుంచి వికాసం వైపు నడిపించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్న సీఎం, ఉపాధ్యాయులు 2 ఏళ్లు తనకు సమయం ఇస్తే సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

**ఆ ప్రచారాన్ని నమ్మొద్దు :**

విద్యా విధానంలో ఎలాంటి మార్పులు చేయట్లేదని ఈ సందర్భంగా సీఎం పేర్కొన్నారు. పాలిటెక్నిక్ విషయంలో జరుగుతున్న అవాస్తవ ప్రచారాన్ని నమ్మొద్దని సూచించారు.



## కొండా సురేఖ స్థానంలో ఎవరు?..

కేబినెట్ విస్తరణపై పీసీసీ చీఫ్ కీలక వ్యాఖ్యలు

- కేబినెట్ విస్తరణపై మహేశ్‌కుమార్ గౌడ్ కీలక వ్యాఖ్యలు
- ఢిల్లీ పర్యటనలో విస్తరణపై చర్చ జరగలేదన్న పీసీసీ చీఫ్
- కొండా సురేఖ బర్తరఫ్ ఏఐసీసీ నిర్ణయమని స్పష్టీకరణ
- కేబినెట్ విస్తరణకు హైకమాండ్ నుంచి సమాచారం లేదని వెల్లడి
- విస్తరణ ఎప్పుడు చేయాలనేది సీఎం నిర్ణయమన్న మహేశ్

2

## హైదరాబాద్‌లో దేశంలోనే అతిపెద్ద ఏఐ డేటా సెంటర్



2



## కేసీఆర్ కు పట్టిన గతే రేవంత్‌కూ పడుతుంది

:రాంచందర్ రావు

- 22ఏ నిషేధిత భూముల జాబితాపై రాంచందర్ రావు విమర్శలు
- ధరణి పేరుతో ప్రజలను పీడించిన కేసీఆర్ ప్రభుత్వం ఓటమిపాలైందని ఆరోపణ
- రేవంత్ కూడా అదే బాటలో పయనిస్తూ తన గోతిని తానే తవ్వుకుంటున్నారని వ్యాఖ్య

2

హైదరాబాద్ పల్స్,డెస్క్

సామాన్యుల ఆస్తులు, రైతుల పొలాలను లక్ష్యంగా చేసుకుని కాంగ్రెస్ ప్రభుత్వం భూదందా సాగిస్తోందని తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు విమర్శించారు. 22ఏ నిషిద్ధ జాబితా పేరుతో పేద, మధ్యతరగతి ప్రజల సొంత భూములను లాక్కునేందుకు రేవంత్ రెడ్డి సర్కార్ కుట్ర పన్నుతోందని ఆరోపించారు. ఇందిరాపార్కు ధర్నాచౌక్ వద్ద

కేసీఆర్‌లానే రేవంత్ కూడా

## భూములమ్మే ప్రయత్నం

: కిషన్ రెడ్డి

2

కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. గతంలో ధరణి పేరుతో

## కేసీఆర్ రాజీనామా చేయాలి

- కేసీఆర్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలి: పొన్నం ప్రభాకర్ డిమాండ్
- వెయ్యి రోజులుగా సభకు రాకుండా జీతం తీసుకుంటున్నారని ఆరోపణ
- కేసీఆర్ వైఖరికి నిరసనగా 6న ఇందిరా పార్క్ వద్ద కాంగ్రెస్ మహా ధర్నా
- ధర్నాలో కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనను వివరిస్తామన్న మంత్రులు
- సన్నాహక సమావేశంలో పాల్గొన్న మంత్రులు పొన్నం, శ్రీధర్ బాబు

2



హైదరాబాద్ పల్స్,డెస్క్

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తన ఎమ్మెల్యే పదవికి తక్షణమే రాజీనామా చేయాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు.

## ప్రజల ఆస్తులకు రక్షణ కల్పించాలి

రఘునందన్ రావు

- రేవంత్ రెడ్డి ఇంటికి ఒక న్యాయం.. ప్రజలకు మరో న్యాయమా?
- సింఫనీ పార్క్ హోమ్స్ కాలనీలో 22ఏ బాధితుల సమావేశం
- 12 ఏళ్ల కిందటి కాలనీని 22ఏలో చేర్చారన్న రఘునందన్ రావు
- ప్రజల ఆస్తులకు రక్షణ కల్పించాలని డిమాండ్

2



## 420 సార్లు రాజీనామా చేయాలి



2

- లక్కీ లాటరీ సీఎం రేవంత్‌ను కూల్చే రోజులు త్వరలోనే ఉన్నాయి: కేటీఆర్
- రేవంత్ ఓటుకు నోటు కేసులో దొరికిన దొంగ అన్న కేటీఆర్
- 420 మోసాలకు గాను రేవంత్ 420 సార్లు రాజీనామా చేయాలని డిమాండ్
- మంత్రులు కమీషన్ల కోసం కొట్టుకుంటున్నారని ఆరోపణ

హైదరాబాద్ పల్స్,డెస్క్

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తెలంగాణ యువతకు స్కిల్ లేదనడానికి రేవంత్ రెడ్డికి ఏ అర్హత ఉందని,



## దేనికి ఈ సంబరాలు?

- సమస్యలు గాలికొదిలేసి దేనికి ఈ సంబరాలు?
- రేవంత్ సర్కార్‌పై హరీశ్ రావు తీవ్ర ఆగ్రహం
- వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం
- సమస్యలను గాలికొదిలేసి వేడుకలు జరుపుకుంటున్నారంటూ హరీశ్ విమర్శ
- ప్రభుత్వం కుంభకోణాలమయం అయిందని ఆరోపణ

2

హైదరాబాద్ పల్స్,డెస్క్

కాంగ్రెస్ పార్టీ వెయ్యి రోజుల పాలన వేడుకలను జరుపుకోవడంపై బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శలు గుప్పించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నింటినీ గాలికొదిలేసిన

## విచ్చలవిడిగా దోచుకుంటున్నాయి



- అది విద్యా వ్యవస్థా లేక కార్పొరేట్ దోపిడీ వ్యవస్థా?
- ప్రైవేట్ స్కూళ్ల ఫీజుల మోతపై రేవంత్‌ను నిలదీసిన కవిత
- ప్రైవేట్ స్కూళ్లు విచ్చలవిడిగా దోచుకుంటున్నాయని కవిత ఆగ్రహం
- స్కూళ్ల ఫీజుల కట్టడికి ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదని మండిపాటు
- విద్యార్థుల తల్లిదండ్రుల జేబులు గుల్లవుతున్నా రేవంత్ మౌనం వహిస్తున్నారన్న కవిత

2

హైదరాబాద్ పల్స్,డెస్క్

ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో విచ్చలవిడిగా సాగుతున్న ఫీజుల దోపిడీపై కల్వకుంట్ల కవిత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

# ముస్లింలకు వర్తించదా?

- రాజ్యాంగం కల్పించిన ఆ స్వేచ్ఛ ఇక ముస్లింలకు వర్తించదా?: అసదుద్దీన్ ఒవైసీ
- సహారన్‌పుర్ కలెక్టరేట్‌లో మసీదు కూల్చివేత రాజ్యాంగ మత స్వేచ్ఛపై ఓవైసీ ప్రశ్న
- 1911 నాటి రికార్డులు ఉన్నాయన్న ఓవైసీ
- కోర్టు ఆదేశాలతో కూల్చివేత చేపట్టిన అధికారులు
- ఘటనతో ఉత్తర్‌ప్రదేశ్‌లో రాజకీయ దుమారం



2

హైదరాబాద్ పల్స్,డెస్క్

ఉత్తర్‌ప్రదేశ్‌లోని సహారన్‌పుర్ కలెక్టరేట్ ప్రాంగణంలోని మసీదు కూల్చివేతపై ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసీ తీవ్రంగా స్పందించారు. ముస్లింలకు రాజ్యాంగం కల్పించిన మత స్వేచ్ఛ ఇక వర్తించదా? అని ప్రశ్నించారు. శనివారం తెల్లవారుజామున 5 గంటలకు మసీదును కూల్చివేసినట్లు

## ఎదురుచూస్తున్న 12వ పీఆర్సీకి గ్రీన్ సిగ్నల్

- ఉద్యోగులకు చంద్రబాబు తీపి కబురు..
- ఉద్యోగ సంఘాలతో సీఎం చంద్రబాబు సమావేశం
- పలు కీలక డిమాండ్లకు సానుకూలంగా స్పందించిన ప్రభుత్వం
- 12వ పీఆర్సీ ఏర్పాటుకు, రెండు డీఏల విడుదలకు అంగీకారం
- సరెండర్ లీవులు, అదనపు పెన్షన్ క్వాంటంపై కీలక నిర్ణయాలు
- ప్రభుత్వంపై ఏటా రూ. 2880 కోట్ల అదనపు భారం
- ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న 12వ పీఆర్సీకి గ్రీన్ సిగ్నల్

2



హైదరాబాద్ పల్స్,డెస్క్

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగులకు ముఖ్యమంత్రి చంద్రబాబు శుభవార్త అందించారు. ఉద్యోగులు ప్రభుత్వంలో భాగమని, వారికి అన్ని విధాలా అండగా నిలుస్తామని స్పష్టం

# కేసీఆర్ కు పట్టిన గతే రేవంత్‌కూ పడుతుంది

మొదటి పేజీ రువాయి

బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి నాయకత్వంలో ఈరోజు జరిగిన మహాధర్నాకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజల భూములపై పడ్డ ఏ పాలకుడు చరిత్రలో బాగుపడలేదని హెచ్చరించారు.
గతంలో కేసీఆర్ ప్రభుత్వం 'ధరణి'తో ప్రజలను పీడించి ఏ విధంగా అధికారానికి దూరమైందో... ఇప్పుడు రేవంత్ రెడ్డి కూడా అదే బాటలో పయనిస్తూ తన గోతిని తానే తవ్వుకుంటున్నారని మండిపడ్డారు. హైడ్రా, క్యూర్, 22ఏ వంటి నిర్ణయాలతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ, 30 శాతం కమీషన్ల కోసం రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీకి భవిష్యత్తులో బీఆర్ఎస్ కంటే దారుణమైన పరాభవం తప్పదని స్పష్టం చేశారు. వెంటనే 22ఏ కింద చేర్చిన బాధితుల భూములపై రివ్యూ జరిపి, ఆ జాబితా నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. బాధితులకు న్యాయం జరిగే వరకు బీజేపీ రాజీలేని పోరాటం చేస్తుందని తేల్చిచెప్పారు.

# కొండా సురేఖ స్థానంలో ఎవరు?..

మొదటి పేజీ రువాయి

కొండా సురేఖను మంత్రి వర్గం నుంచి తప్పించిన నేపథ్యంలో తెలంగాణ కేబినెట్ విస్తరణపై జోరుగా చర్చ జరుగుతోంది. ఈ క్రమంలో పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇవాళ మీడియాతో చిట్‌చాట్‌లో మాట్లాడిన ఆయన.. ప్రస్తుతం కేబినెట్ విస్తరణపై ఎలాంటి చర్చ జరగలేదని స్పష్టం చేశారు. ఇటీవల తాను ఢిల్లీ వెళ్లినప్పుడు మంత్రివర్గ విస్తరణ అంశం ప్రస్తావనకు రాలేదన్నారు. కొండా సురేఖ, చిన్నారెడ్డికి సంబంధించిన అంశాలపైనే అధిష్ఠానంతో చర్చ జరిగిందని తెలిపారు. కొండా సురేఖను మంత్రి వర్గం నుంచి తప్పించడం పూర్తిగా ఏఐసీసీ నిర్ణయమని మహేశ్‌కుమార్ గౌడ్ చెప్పారు. ఆమెపై చర్యలు తీసుకోకుండా ఆపేందుకు ప్రయత్నించినా.. ఏఐసీసీ ఈ విషయంలో సీరియస్‌గా ఉండటంతో నిర్ణయం జరిగిపోయిందన్నారు.

**ఇప్పట్లో విస్తరణ లేనట్లే!**

ప్రస్తుతం కేబినెట్ విస్తరణకు సంబంధించి హైకమాండ్ నుంచి తమకు ఎలాంటి సమాచారం లేదని పీసీసీ చీఫ్ తెలిపారు. రాష్ట్రంలో మంత్రివర్గాన్ని ఎప్పుడు విస్తరించాలనేది ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్ణయిస్తారని స్పష్టం చేశారు. తనకు మంత్రి పదవి దక్కుతుందంటూ జరుగుతున్న ప్రచారంపైనా మహేశ్‌కుమార్ గౌడ్ స్పందించారు. ఈ వార్తలపై తనకు ఎలాంటి సమాచారం లేదని తేల్చిచెప్పారు. దీంతో కొండా సురేఖ స్థానంలో ఎవరికి అవకాశం దక్కుతుందన్న చర్చకు ఇప్పటికైతే స్పష్టత రాలేదు.

### కేసీఆర్‌లానే రేవంత్ కూడా

# భూములమ్మే ప్రయత్నం

మొదటి పేజీ రువాయి

బీఆర్ఎస్ మోసం చేసిందని.. ఇప్పుడు భూభారతి పేరుతో కాంగ్రెస్ అవినీతికి తెరలేపిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. భూములు దోచుకోవడానికే 22 ఞా తీసుకొచ్చారని అన్నారు. పట్టాలు, పర్మిషన్లు ఉన్న భూములను 22 ఞాలో చేర్చారని మండిపడ్డారు. కేసీఆర్‌లానే రేవంత్ కూడా భూములమ్మే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం భూములు అమ్మడమే అంటూ వ్యాఖ్యానించారు. భూములు అమ్మకపోతే ప్రభుత్వం నడవలేని పరిస్థితి ఉందని కేంద్ర మంత్రి దుయ్యబట్టారు. వక్ఫ్ భూములపై తప్ప అన్ని భూములపై సీఎం రేవంత్ కన్నేశారని విమర్శించారు. ఏ రాష్ట్రంలో ఎన్నికలు జరిగినా తెలంగాణలో భూములు అమ్మాలని.. ఢిల్లీలోని కాంగ్రెస్‌కు ఇవ్వాలంటూ వ్యాఖ్యానించారు. తెలంగాణను రియల్ ఎస్టేట్ సంస్థగా మార్చారంటూ కిషన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు

# హైదరాబాద్‌లో దేశంలోనే అతిపెద్ద ఏఐ డేటా సెంటర్

మొదటి పేజీ రువాయి

హైదరాబాద్‌లో దేశంలోనే అతిపెద్ద ఏఐ డేటా సెంటర్?ను ఏర్పాటు చేయనున్నట్లు టీసీఎస్? అనుబంధ సంస్థ హైపర్ వాల్ట్ ప్రకటించింది. అందుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. సచివాలయంలో టీసీఎస్ హైపర్ వాల్ట్ ప్రతినిధుల బృందం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో శనివారం సమావేశమైంది. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతోపాటు మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఈ సమావేశంలో పాల్గొన్నారు. టీసీఎస్ సీఈఓ కె.కృతివాసన్, సీవోవో ఆర్తి సుబ్రమణియన్, హైపర్ వాల్ట్ ప్రెసిడెంట్ వి.రాజన్న, హైపర్ వాల్ట్ సీఈఓ, ఎండీ దీపేష్ నందా సమావేశంలో పాల్గొన్నారు. అమెరికా నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఓపెన్ ఏఐ చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ ఉదయ్ రుద్రరాజు సమావేశంలో పాల్గొన్నారు.

**రూ.70వేల కోట్ల పెట్టుబడి!**

హైదరాబాద్‌లో 250 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో 1 గిగావాట్ (1,000 మెగావాట్లు) సామర్థ్యంతో ఈ అత్యాధునిక ఏఐ డేటా సెంటర్ క్యాంపస్‌ను అభివృద్ధి చేయనున్నారు. హైపర్ వాల్ట్‌తోపాటు భాగస్వామ్య సంస్థలు ఈ ప్రాజెక్టు నిర్మాణం, నిర్వహణకు దాదాపు రూ.70 వేల కోట్లు పెట్టుబడి పెట్టనున్నారు. ఈ ప్రాజెక్టుతో ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 7 వేల ఉద్యోగాలు అందుబాటులోకి రానున్నాయి. ప్రపంచంలోని అగ్రశ్రేణి ఏఐ కంపెనీలు, హైపర్‌స్కేలర్లు, గ్లోబల్ ఎంటర్‌ప్రైజెస్‌కు అవసరమైన భారీ కంప్యూటింగ్ మౌలిక వసతులను ఈ క్యాంపస్ అందించనుంది. అధిక సామర్థ్యమున్న కంప్యూటింగ్ వ్యవస్థలు, లిక్విడ్ కూలింగ్ వంటి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఈ కేంద్రాన్ని తీర్చిదిద్దనున్నారు. దేశంలోని అత్యంత అధునాతన, అతిపెద్ద ఏఐ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ క్యాంపస్‌లలో ఇది ఒకటిగా నిలవనుంది.

# కేసీఆర్ రాజీనామా చేయాలి

మొదటి పేజీ రువాయి

ప్రజాప్రతినిధిగా తన బాధ్యతలు నిర్వర్తించని వ్యక్తి ఆ పదవిలో కొనసాగడం సమంజసం కాదని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ విషయమై ఈ నెల 6న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద 'మహా ధర్నా' నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ ధర్నాకు సంబంధించిన సన్నాహక సమావేశంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో రాష్ట్రానికి వందేళ్ల నష్టం వాటిల్లిందని విమర్శించారు. "వెయ్యి రోజులుగా ఎమ్మెల్యేగా వేతనం తీసుకుంటున్న కేసీఆర్ అసెంబ్లీకి రావడం లేదని, కనీసం తన నియోజకవర్గ ప్రజలకు కూడా అందుబాటులో ఉండటం లేదు. ప్రతిపక్ష నేతగా ఆయన పూర్తిగా విఫలమయ్యారు" అని ఆరోపించారు. కేసీఆర్ వైఖరిని ప్రజల దృష్టికి తీసుకెళ్లడానికే ఈ నిరసన కార్యక్రమం చేపడుతున్నామని మంత్రి స్పష్టం చేశారు. ఇదే వేదికగా కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల ప్రజాపాలనలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తామని ఆయన తెలిపారు. ఈ మహా ధర్నాను విజయవంతం చేయాలని కాంగ్రెస్ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు.

# ప్రజల ఆస్తులకు రక్షణ కల్పించాలి

మొదటి పేజీ రువాయి

రూపాయి రూపాయి కూడబెట్టుకుని నిర్మించుకున్న ఇళ్లను రాత్రికి రాత్రి 22ఏ నిషేధిత జాబితాలో చేర్చడం రేవంత్ రెడ్డి ప్రభుత్వ దారుణ నిర్ణయమని మెదక్ ఎంపీ రఘునందన్ రావు మండిపడ్డారు. పటాన్‌చెరు నియోజకవర్గంలోని సింఫనీ పార్క్ హోమ్స్ కాలనీలో 22ఏ భూముల సమస్యపై ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన హాజరయ్యారు. అన్ని ప్రభుత్వ శాఖల అనుమతులతో 55 ఎకరాల్లో 1,500 ఇళ్ల నిర్మాణం జరిగి 12 ఏళ్లు గడుస్తోందని... ఇప్పుడు ఉన్నట్టుండి ఆ ఇళ్లను నిషేధిత జాబితాలో పెట్టడంపై కాలనీవాసులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని చెప్పారు. బాధితుల పక్షాన పోరాడతానని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన నివాసాన్ని ఏ దరఖాస్తు ఆధారంగా 22ఏ జాబితా నుంచి తొలగించారో, అదే నిబంధనలను సామాన్య ప్రజల ఆస్తులకు కూడా వర్తింపజేసి వెంటనే తొలగించాలని ఎంపీ రఘునందన్ రావు సూటిగా నిలదీశారు. కేవలం సాంకేతిక తప్పు జరిగిందని రెవెన్యూ మంత్రి క్షమాపణలు చెబితే సరిపోదని, తక్షణమే ఆ తప్పును సరిదిద్ది ప్రజల ఆస్తులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ 22ఏ జాబితా పేరుతో ప్రజలను ఇబ్బందులకు గురిచేసిన అధికారులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# 420 సార్లు రాజీనామా చేయాలి

మొదటి పేజీ రువాయి

ఆయన స్వయంగా ఓటుకు నోటు కేసులో దొరికిన దొంగ అని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో చేసిన మోసాలపై బీఆర్ఎస్ నిర్వహించిన 'యువభేరి' సభలో పాల్గొన్న కేటీఆర్, కేవలం లక్కీ లాటరీ తగలడం వల్లే రేవంత్ సీఎం అయ్యారని ఎద్దేవా చేశారు. ప్రధాని మోదీనే గడగడలాడించిన తెలంగాణ యువశక్తికి రేవంత్ రెడ్డి ఓ లెక్కే కాదన్నారు. ఎన్నికల ముందు యూత్ డిక్లరేషన్ పేరిట పెద్ద పెద్ద మాటలు చెప్పిన కాంగ్రెస్ నేతలు, అధికారంలోకి వచ్చాక ఉద్యోగాలు ఇవ్వడం మానేసి లూటీఫికేషన్‌లు నడుపుతున్నారని మండిపడ్డారు. ఎమ్మెల్యే పదవికి కేసీఆర్ రాజీనామా చేయాలంటున్న కాంగ్రెస్ నేతలకు కేటీఆర్ కౌంటర్ ఇచ్చారు. తెలంగాణ రాష్ట్రాన్ని తెచ్చిన కేసీఆర్ రాజీనామా చేయాలా, లేక ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను వంచించిన రేవంత్ రెడ్డి రాజీనామా చేయాలా అని ప్రశ్నించారు. ప్రజలకు చేసిన 420 రకాల మోసాలకు గానూ రేవంత్ రెడ్డి 420 సార్లు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కేవలం ఒక్క మంత్రిని బర్తరఫ్ చేయడం కాదని, త్వరలోనే కాంగ్రెస్ ప్రభుత్వాన్నే బర్తరఫ్ చేసే రోజులు రాబోతున్నాయని హెచ్చరించారు. మంత్రులు కమీషన్ల కోసం కొట్టుకుంటున్నారని, పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో తమ ప్రభుత్వం 2.32 లక్షల ఉద్యోగాలు ఇస్తే, ఈ వెయ్యి రోజుల్లో కాంగ్రెస్ ఇచ్చినవి కేవలం 16 వేల ఉద్యోగాలేనని చెప్పారు. ఉద్యోగాల కల్పనపై బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు.

# దేనికి ఈ సంబరాలు?

మొదటి పేజీ రువాయి

కాంగ్రెస్ ప్రభుత్వం ఏ ముఖం పెట్టుకుని సంబరాలు చేసుకుంటోందని ప్రశ్నించారు. కాంగ్రెస్ నాయకుల తీరు 'ఉల్టా చోర్ కొత్వాల్ కో డాంటే' అన్న చందంగా తయారైందని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సాగిస్తున్న పరిపాలనా విధానాన్ని, ఆయన పనితీరును ప్రజలు తీవ్రంగా అసహ్యించుకుంటున్నారని మండిపడ్డారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా కుంభకోణాలమయంగా మారిపోయిందని హరీశ్ రావు ఆరోపించారు. హామీలు నెరవేర్చడంలో విఫలమైన రేవంత్ రెడ్డి రాజీనామా చేయాలని తాము డిమాండ్ చేస్తుంటే, బాధ్యతారాహిత్యంగా కేసీఆర్ రాజీనామా చేయాలనడం విడ్డూరంగా ఉందన్నారు. రాజీనామా చేయాల్సింది కేసీఆర్ కాదని, ప్రజలను మోసం చేసిన రేవంత్ రెడ్డేనని తేల్చిచెప్పారు. విద్యార్థులు, నిరుద్యోగుల ఆవేదన, జీఓ 97 రద్దు, రైతాంగానికి నమ్మకమైన ఉచిత విద్యుత్ సరఫరా వంటి కీలక ప్రజా సమస్యలే ఎజెండాగా రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో బీఆర్ఎస్ గళమెత్తుతుందని తెలిపారు. సభలో కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టేందుకు అధినేత కేసీఆర్ బీఆర్ఎస్ఎల్పీ సమావేశంలో పూర్తి దిశానిర్దేశం చేస్తారని హరీశ్ రావు స్పష్టం చేశారు.

# ముస్లింలకు వర్తించదా?

మొదటి పేజీ రువాయి

తెలిపారు. మసీదు ఉనికిని నిరూపించే 1911 నాటి రికార్డులు కమిటీ వద్ద ఉన్నాయని ఓవైసీ చెప్పారు. శతాబ్దానికి పైగా అక్కడ ప్రార్థనలు జరుగుతున్నాయని తెలిపారు. ఇది 'వక్ఫ్ బై యూజర్' పరిధిలోకి వస్తుందని పేర్కొన్నారు. ఏళ్ల తరబడి అక్కడ ప్రార్థనలు జరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వం ఇప్పుడు ఆ భూమిపై హక్కు ఎలా కోరుతుందని ఓవైసీ ప్రశ్నించారు. "మసీదు ముందే ఉంది.. కలెక్టరేట్ ఆ తర్వాత వచ్చింది" అని వ్యాఖ్యానించారు. మసీదును కూల్చేందుకు బుల్డోజర్ ఉపయోగించడాన్ని తప్పుబట్టారు. "నా మత స్వేచ్ఛ మీ దయపై ఆధారపడి లేదు" అని స్పష్టం చేశారు. కోర్టు ఆదేశాల మేరకే కూల్చివేత చేపట్టినట్లు అధికారులు తెలిపారు. మసీదును ప్రభుత్వ భూమిపై ఉన్న అక్రమ నిర్మాణంగా కోర్టు గతంలో ప్రకటించింది. ముస్లిం పక్షం దాఖలు చేసిన అప్పీల్‌ను జిల్లా న్యాయస్థానం శుక్రవారం తిరస్కరించింది. దీంతో శనివారం భారీ భద్రత మధ్య కూల్చివేత చేపట్టారు. ఈ ఘటనపై రాజకీయంగా దుమారం రేగింది. సహారన్‌పూర్ వెళ్లేందుకు సిద్ధమైన సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ ఇక్రా హసన్‌ను పోలీసులు ఇంటి నుంచి బయటకు రాకుండా అడ్డుకున్నారని ఆమె వర్గం తెలిపింది. ఆమె నివాసం వద్ద భారీగా బలగాలను మోహరించారు. కాంగ్రెస్ ఎంపీ ఇమ్రాన్ మసూద్ కూడా కూల్చివేతను తప్పుబట్టారు. భూమి రికార్డులు, వక్ఫ్ బోర్డు అంశాలను ఆయన ప్రస్తావించారు. ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించే అవకాశం ఇవ్వలేదని ఆరోపించారు. ఈ పరిణామంతో పశ్చిమ ఉత్తర్‌ప్రదేశ్‌లో రాజకీయ వేడి మరింత పెరిగింది.

# విచ్చలవిడిగా దోచుకుంటున్నాయి

మొదటి పేజీ రువాయి

లక్ష్యంగా తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. విద్యా సంవత్సరం ప్రారంభమై మూడు నెలలు గడుస్తున్నా ప్రైవేట్ స్కూళ్ల ఫీజుల కట్టడికి ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్కూల్ ఫీ రెగ్యులేటరీ కమిషన్‌ను తీసుకొస్తామని గతంలో ఇచ్చిన హామీ ఏమైందని, దానికి సంబంధించిన డ్రాఫ్ట్ బిల్లు రెండేళ్లుగా కేబినెట్ దాటి బయటకు ఎందుకు రావడం లేదని ప్రశ్నించారు. స్వయంగా విద్యాశాఖను తన వద్దే ఉంచుకున్న సీఎం రేవంత్ రెడ్డి... పేద, మధ్యతరగతి తల్లిదండ్రుల జేబులు గుల్లవుతున్నా ఎందుకు మౌనం వహిస్తున్నారని నిలదీశారు. ప్రభుత్వ భూముల్లో నడిచే హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ సైతం ఇష్టారాజ్యంగా ఫీజులు పెంచినా సర్కార్ మౌనంగా ఉండటం కార్పొరేట్ విద్యా వ్యాపారులకు బాసటగా నిలవడమేనని కవిత ఆరోపించారు. 1994 నాటి జీవో ప్రకారం వార్షిక ఫీజుల పెంపు 5 శాతానికి మించకూడదన్న స్పష్టమైన నిబంధన ఉన్నా దానిని పక్కనబెట్టి, విద్యా వ్యవస్థను దెబ్బతీస్తున్నారని మండిపడ్డారు. రాబోయే శాసనసభ సమావేశాల్లోనే తక్షణమే పాఠశాల ఫీజుల నియంత్రణ బిల్లును ప్రవేశపెట్టి ఆమోదింపజేయాలని, లేనిపక్షంలో బాధితులతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

# ఎదురుచూస్తున్న 12వ పీఆర్సీకి గ్రీన్ సిగ్నల్

మొదటి పేజీ రువాయి

చేసిన ఆయన, వారి దీర్ఘకాలిక డిమాండ్లపై సానుకూలంగా స్పందించారు. శనివారం వివిధ ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో సమావేశమైన సీఎం, పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు.
ఈ నిర్ణయాల ద్వారా ప్రభుత్వంపై ఏటా రూ.2,880 కోట్ల అదనపు భారం పడనుందని సీఎం కార్యాలయం వెల్లడించింది.
ఉద్యోగ సంఘాల నేతలతో జరిగిన చర్చల అనంతరం ప్రభుత్వం తీసుకున్న ముఖ్య నిర్ణయాలు ఇవే:
12వ పీఆర్సీ : ఉద్యోగులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న 12వ వేతన సవరణ సంఘం (పీఆర్సీ) నియామకానికి ముఖ్యమంత్రి చంద్రబాబు ఆమోదం తెలిపారు.
డీఏల చెల్లింపు: 2024 జూలై 1, 2025 జనవరి 1 తేదీలకు చెందిన రెండు కరువు భత్యం (డీఏ) బకాయిలను 2026 అక్టోబర్ 1 నుంచి చెల్లించాలని నిర్ణయించారు.
సరెండర్ లీవులు: 2022 సంవత్సరానికి సంబంధించిన సరెండర్ లీవుల మొత్తాన్ని వచ్చే సంక్రాంతి నాటికి ఉద్యోగుల ఖాతాల్లో జమ చేయడానికి అంగీకరించారు.
పోలీసులకు అదనపు లీవ్: పోలీసు సిబ్బందికి ఒక అదనపు సరెండర్ లీవ్‌ను ఈ దసరా పండుగకు చెల్లించాలని నిర్ణయం తీసుకున్నారు.
అదనపు పెన్షన్: అడిషనల్ క్వాంటం ఆఫ్ పెన్షన్‌ను 2027 జనవరి నుంచి అమలు చేయనున్నారు. దీని ప్రకారం, 70 ఏళ్లు దాటిన వారికి 10 శాతం, 75 ఏళ్లు దాటిన వారికి 15 శాతం అదనపు పెన్షన్ లభిస్తుంది.
ఉద్యోగుల ఆరోగ్య పథకం : ఈహెచ్‌ఎస్‌ను మరింత పటిష్ఠం చేయాలని, వచ్చే నెల నుంచే ప్రతినెలా బిల్లుల చెల్లింపులను ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్ట్‌కు ప్రభుత్వం నేరుగా చెల్లించాలని నిర్ణయించారు.
ఈ సమావేశంలో ఉద్యోగ సంఘాల నేతలు తమ సమస్యలను సీఎం దృష్టికి తీసుకురాగా, ఆయన సానుకూలంగా స్పందించారు. ఉద్యోగుల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని హామీ ఇచ్చారు. ఈ మేరకు తీసుకున్న నిర్ణయాలను ముఖ్యమంత్రి కార్యాలయం సోషల్ మీడియా ద్వారా అధికారికంగా ప్రకటించింది. దీంతో ప్రభుత్వ ఉద్యోగుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి

# 2 ఏళ్లు టైమ్ ఇవ్వండి

మొదటి పేజీ రువాయి

ఉపాధ్యాయులను అడ్డుపెట్టుకుని ప్రభుత్వాన్ని బ్లాక్ మెయిల్ చేయాలని చూస్తున్నారన్న రేవంత్ రెడ్డి, అలాంటి వారి ట్రాప్‌లో పడొద్దని కోరారు. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయన్నారు. ప్రభుత్వ విద్యను బలోపేతం చేసేందుకు మనమంతా పునరంకితమవుదామని పిలుపునిచ్చిన ముఖ్యమంత్రి, ఉపాధ్యాయుల బాధ్యత తాను చూసుకుంటానని, విద్యార్థుల బాధ్యత టీచర్లు చూసుకోవాలని సూచించారు.

**'సర్'తో ఓట్లు తొలగించే కుట్ర**

అంతకుముందు కొడంగల్ నివాసంలో కార్యకర్తలు, స్థానిక నాయకులతో సీఎం రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు. కేంద్ర ప్రభుత్వం సర్ పేరుతో ఓట్లను తొలగించే కుట్ర చేస్తోందని రేవంత్ రెడ్డి ఆరోపించారు. బీజేపీయేతర ప్రభుత్వాలు ఉన్న రాష్ట్రాలను లక్ష్యంగా చేసుకున్నారని అన్నారు. తెలంగాణలో ఓట్లను తొలగించి దొంగ దెబ్బ తీయాలనుకుంటే కాంగ్రెస్ కార్యకర్తలు ఊరుకోరని హెచ్చరించారు. కాంగ్రెస్ అనుకూల ఓట్లను తొలగించాలని చూస్తున్నారన్న ముఖ్యమంత్రి, ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ ఓట్లను బీజేపీ టార్గెట్ చేసిందన్నారు. గతంలో ఎన్నికల్లో ఓడించేందుకు ఈడీ, సీబీఐ ఉపయోగించేవారన్నారు. కాంగ్రెస్‌ను ఓడించే కుట్రకు బీఆర్ఎస్ కూడా బీజేపీకి మద్దతు ఇస్తోందన్న రేవంత్ రెడ్డి, అందరూ అప్రమత్తంగా ఉండి వారి కుట్రలను తిప్పికొట్టాలని స్పష్టం చేశారు.

# 40 ఏళ్ల ప్రజల చిరకాల వాంఛ నెరవేర్చిన ఎమ్మెల్యే సంజీవరెడ్డి

## తుర్కపల్లి-కడ్పల్ నూతన రహదారి పనుల పరిశీలన

**హైదరాబాద్ పల్స్ న్యూస్, సెప్టెంబర్ 05, నారాయణఖేడ్:**
నారాయణఖేడ్ నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలను దశలవారీగా నెరవేర్చేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు.నారాయణఖేడ్ మండలం తుర్కపల్లి నుంచి పోతన్‌పల్లి, పల్గు తండా మీదుగా సిర్గాపూర్ మండలం కడ్పల్ వరకు చేపడుతున్న నూతన రహదారి నిర్మాణ పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. పనుల నాణ్యతను స్వయంగా తనిఖీ చేసి, సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గత 40 ఏళ్లుగా సరైన రహదారి సౌకర్యం లేక ఈ ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. దశాబ్దాలుగా రహదారి కోసం ఎదురుచూస్తున్న ప్రజల ఆకాంక్షను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో నెరవేర్చడం సంతృప్తినిస్తోందన్నారు.ప్రస్తుతం రహదారి నిర్మాణానికి సంబంధించిన మెటలింగ్ పనులు వేగంగా పూర్తయ్యాయని, మిగిలిన డాంబర్ పనులను కూడా త్వరితగతిన, నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పారు.రహదారి నిర్మాణంతో తుర్కపల్లి, పోతన్‌పల్లి, పల్గు తండా, కడ్పల్ గ్రామాలతో పాటు సమీపంలోని పోచపూర్, కాజాపూర్, బీబీపేట్, పతేపూర్ గ్రామాల ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగుపడనుంది. అత్యవసర సమయాల్లో వైద్య సేవలు పొందేందుకు, రైతులు వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్లకు తరలించేందుకు, విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు రాకపోకలు సాగించేందుకు ఈ రహదారి ఎంతో ఉపయోగపడుతుందని స్థానికులు తెలిపారు.40 ఏళ్లుగా ఎదురుచూస్తున్న రహదారి కల సాకారం



అవుతుండటంపై ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. రహదారి పూర్తయితే తమ గ్రామాల అభివృద్ధికి కొత్త మార్గం ఏర్పడుతుందని పేర్కొన్నారు. రహదారి నిర్మాణానికి కృషి చేస్తున్న ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనపై నారాయణఖేడ్‌లో బీఆర్ఎస్ నిరసన

## యువత, విద్యార్థుల సమస్యలపై మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు

**హైదరాబాద్ పల్స్ న్యూస్, సెప్టెంబర్ 05, నారాయణఖేడ్:**
కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తయినా ఎన్నికల సమయంలో యువత, విద్యార్థులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్ రెడ్డి విమర్శించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు నారాయణఖేడ్‌లో యువత, విద్యార్థుల సమస్యలపై నిర్వహించిన నిరసన కార్యక్రమానికి ఆయన నాయకత్వం వహించారు.యువతకు ఉద్యోగాలు, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్మెంట్, విద్యార్థినులకు స్కూటీలు వంటి హామీల అమలుపై భూపాల్ రెడ్డి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. పాలిటెక్నిక్ విద్యార్థులు వ్యతిరేకిస్తున్న జీవో 97ను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా భూపాల్ రెడ్డి మాట్లాడుతూ, ఎన్నికలకు ముందు యువతకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయాలని అన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్మెంట్, విద్యార్థినులకు స్కూటీల హామీల పరిస్థితిపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.నారాయణఖేడ్ నియోజకవర్గంలోని యువత, విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం స్థానిక ఎమ్మెల్యే అసెంబ్లీలో ఎన్నిసార్లు ప్రశ్నించారని ఆయన ప్రశ్నించారు. ప్రజలు ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రతినిధులను ఎన్నుకున్నారని, సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉందన్నారు.ఎన్నికల హామీల అమలు కోసం బీఆర్ఎస్ ప్రజల తరఫున నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని భూపాల్ రెడ్డి తెలిపారు. యువతకు ఉద్యోగాలు, విద్యార్థులకు న్యాయం, ఫీజు రీయింబర్స్మెంట్, పాలిటెక్నిక్ విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వంపై ఒత్తిడి కొనసాగిస్తామని అన్నారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఎన్నికల హామీలను అమలు చేయాలని, యువత, విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, యువకులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# ఉపాధ్యాయుల మాట వినండి.. జీవితానికి బంగారు బాట వేసుకోండి

## నేటి విద్యార్థులే రేపటి ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు కావాలి: రామగుండం సీపీ

**గోదావరిఖని, సెప్టెంబర్ 05 (హైదరాబాద్ పల్స్ ప్రతినిధి):**
విద్యార్థులు ఉపాధ్యాయుల మాటకు గౌరవం ఇచ్చి, వారి సూచనలు పాటిస్తూ జీవితంలో ఉన్నత లక్ష్యాలను సాధించాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా సూచించారు. చెడు వ్యసనాలకు, ముఖ్యంగా గంజాయి వంటి మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు.ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని రామగుండం పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు పెద్దపల్లి జోన్‌లోని ఎన్టీపీసీ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న ఎన్టీపీసీ టీటీఎస్ ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల దుష్ప్రభావాలు, ఉపాధ్యాయ దినోత్సవ ప్రాధాన్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రామగుండం సీఐ కృష్ణకుమార్, సైబర్ నేరాల విభాగం ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఎన్టీపీసీ ఎస్ఐ ఉదయ్ కిరణ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి సీపీ అంబర్ కిషోర్ ఝా, పెద్దపల్లి డీసీపీ బి. రామ్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ తల్లిదండ్రులే ప్రతి ఒక్కరి జీవితంలో తొలి గురువులని, వారి తర్వాత ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని అన్నారు. జీవితంలో ఏ స్థాయికి ఎదిగినా విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను గౌరవించే మనస్తత్వాన్ని విద్యార్థులు అలవరచుకోవాలని సూచించారు. చదువు, వ్యక్తిగత జీవితం లేదా ఇతర అంశాలకు సంబంధించిన సమస్యలు, సందేహాలను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో పంచుకోవాలని తెలిపారు. సమస్యలను మనసులో దాచుకోకుండా వారితో మాట్లాడితే సరైన మార్గనిర్దేశం లభిస్తుందని పేర్కొన్నారు.విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, గంజాయి వంటి మాదకద్రవ్యాల వినియోగం భవిష్యత్తును దెబ్బతీసే ప్రమాదం ఉందని హెచ్చరించారు. గంజాయి విక్రయాలు లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే 1908కు తెలియజేయాలని సూచించారు.సైబర్ నేరాల విషయంలో విద్యార్థులు, తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. గుర్తుతెలియని వ్యక్తులు పంపే అనుమానాస్పద లింకులను తెరవకూడదని, వ్యక్తిగత వివరాలు, బ్యాంకు ఖాతా సమాచారం, ఓటీపీ వంటి వివరాలను ఎవరికీ వెల్లడించకూడదని సూచించారు. సైబర్ మోసానికి గురైన వెంటనే 1930కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని తెలిపారు.అత్యవసర పరిస్థితులు, ప్రమాదాలు, అగ్నిప్రమాదాలు లేదా ఇతర ఆపద సమయాల్లో పోలీసుల సహాయం కోసం 112కు ఫోన్ చేయాలని విద్యార్థులకు వివరించారు. గతంలో అందుబాటులో ఉన్న 100 నంబర్ స్థానంలో ప్రస్తుతం 112 అత్యవసర సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.విద్యార్థుల భద్రత కోసం పోలీసు అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారని సీపీ పేర్కొన్నారు. ఏసీపీలు, సీఐలు, ఎస్‌హెచ్‌ఓలు పాఠశాలల పరిసరాలను క్రమం తప్పకుండా సందర్శిస్తూ భద్రతా పరిస్థితులను పరిశీలిస్తున్నారని తెలిపారు. అయితే విద్యార్థులే తమ భద్రతకు తొలి రక్షకులని, అనుమానాస్పద కార్యకలాపాలు కనిపించినప్పుడు వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండి క్రమశిక్షణతో చదువుకోవాలని, భవిష్యత్తులో ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు, శాస్త్రవేత్తలు, ప్రజాప్రతినిధులుగా ఎదిగి సమాజానికి సేవ చేయాలని సీపీ ఆకాంక్షించారు.

**సైబర్ భద్రతపై అవగాహన పోస్టర్ ఆవిష్కరణ**
వినాయక చవితిని పురస్కరించుకుని తెలంగాణ సైబర్ భద్రతా విభాగం రూపొందించిన "వినాయకుడి నుంచి సైబర్ భద్రత పాఠాలు" అనే అవగాహన పోస్టర్‌ను సీపీ అంబర్ కిషోర్ ఝా, డీసీపీ బి. రామ్‌రెడ్డి ఆవిష్కరించారు. సైబర్ మోసాల నుంచి రక్షణ పొందేందుకు ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వినూత్న రీతిలో వివరించేలా పోస్టర్‌ను రూపొందించారు.కార్యక్రమంలో ఎంఈఓ మల్లేశం, రామగుండం సీఐ కృష్ణకుమార్, ఎన్టీపీసీ ఎస్ఐ ఉదయ్ కిరణ్, బసంత్‌నగర్ ఎస్ఐ శ్రీధర్, రామగుండం ఎస్ఐ సంధ్యారాణి, అంతర్గాం ఎస్ఐ వెంకట్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి. జయరాజ్, స్థానిక కార్పొరేటర్ కవిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.






# పేద, మధ్యతరగతి కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ అండ: ఎమ్మెల్యే శ్రీగణేష్

## 35 మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ
## పికెట్‌లోని క్యాంపు కార్యాలయంలో అందజేసిన కంటోన్మెంట్ ఎమ్మెల్యే

**పికెట్ (హైదరాబాద్ పల్స్, సెప్టెంబర్ 05):**
అనారోగ్య సమస్యలతో ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ఎంతో అండగా నిలుస్తోందని కంటోన్మెంట్ శాసనసభ్యులు శ్రీగణేష్ తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ ఆర్థిక సాయం బాధితుల కుటుంబాలకు పెద్ద భరోసానిస్తుందని ఆయన పేర్కొన్నారు.శనివారం పికెట్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కంటోన్మెంట్ నియోజకవర్గానికి చెందిన 35 మంది లబ్ధిదారులకు ప్రభుత్వం మంజూరు చేసిన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే శ్రీగణేష్ స్వయంగా పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గ ప్రజల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. పేదరికం వల్ల ఎవరూ వైద్యానికి దూరం కాకూడదనే ఉద్దేశంతోనే ఈ సహాయం అందిస్తున్నామని తెలిపారు. తాను నియోజకవర్గ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ, వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులు మరియు వారి కుటుంబ సభ్యులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు.







# బీరంగూడ డివిజన్ కాలనీల సమస్యలు పరిష్కరించాలి

## జోనల్ కమిషనర్ నారాయణ అమిత్ ఐఏఎస్‌కు శశిధర్ రెడ్డి వినతి

**అమీన్‌పూర్, సెప్టెంబర్ 05 (హైదరాబాద్ పల్స్ న్యూస్):**
బీరంగూడ డివిజన్ పరిధిలోని వివిధ కాలనీల్లో పెండింగ్‌లో ఉన్న మౌలిక వసతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ అమీన్‌పూర్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు శశిధర్ రెడ్డి, కాలనీ వాసులతో కలిసి శేరిలింగంపల్లి జోన్ జోనల్ కమిషనర్ నారాయణ అమిత్ ఐఏఎస్‌ను కలిశారు.ఈ సందర్భంగా మల్లారెడ్డి కాలనీ, మారుతి నగర్ కాలనీ, లక్ష్మీ సాయి మెడోస్, వందనపురి కాలనీ, బీహెచ్ఎల్ మెట్రో, ఎన్ఎస్ఎల్ కాలనీ, లింగమయ్య కాలనీ, సృజన లక్ష్మీనగర్ కాలనీ, ఉసుకేబావి తదితర ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు.కాలనీల్లో రోడ్లు, డ్రైనేజీ, పారిశుద్ధ్యం, ఇతర మౌలిక వసతులకు సంబంధించిన పలు పనులు పెండింగ్‌లో ఉన్నాయని, దీంతో స్థానిక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పెండింగ్ పనులను పరిశీలించి, అవసరమైన చర్యలు తీసుకుని త్వరితగతిన ప్రారంభించాలని కోరారు.ప్రజలకు అసౌకర్యం కలగకుండా సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేస్తూ కాలనీ వాసులతో కలిసి సమస్యల వివరాలతో కూడిన వినతిపత్రాన్ని జోనల్ కమిషనర్‌కు అందజేశారు.సమస్యలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చినట్లు శశిధర్ రెడ్డి తెలిపారు.



# పాఠశాల ప్రాంగణానికి సౌకర్యవంతమైన బాట

**హైదరాబాద్ పల్స్, సెప్టెంబర్ 05, మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి :**
డోర్నకల్ మండలం వెన్నారం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల వద్ద వర్షం కురిసిన సమయంలో ఏర్పడుతున్న నీటి నిల్వలతో విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులకు పరిష్కారం లభించనుంది. సమస్యను గుర్తించిన స్థానిక కాంగ్రెస్ నాయకులు పాఠశాల వద్ద సిమెంట్ పనులు చేపట్టి ప్రాంగణాన్ని మెరుగుపరిచే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. వర్షపు నీరు పాఠశాల పరిసరాల్లో నిలిచిపోవడంతో విద్యార్థులు పాఠశాలకు చేరుకునే సమయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని నీటి నిల్వకు అవకాశం లేకుండా సిమెంట్ పనులు చేపట్టారు. విద్యార్థుల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా పాఠశాల పరిసరాలను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పనులు కొనసాగిస్తున్నారు. పిల్లల విద్యాభ్యాసానికి అనుకూలమైన వాతావరణం ఉండాలంటే పాఠశాలల్లో మౌలిక వసతులు ఎంతో అవసరమని ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు. విద్యార్థుల సమస్యను పరిష్కరించేందుకు ముందుకు వచ్చిన నాయకులకు పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్థులు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సొసైటీ వైస్ చైర్మన్ వెంకన్న, కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి జక్కుల పావని వెంకన్న, వార్డు నెంబర్ సత్యం, నాగేశ్వరరావు, ఉపేందర్, రంజాన్, సతీష్, కృష్ణమూర్తి, వీరేందర్, కుదుళ్ల సతీష్, పాఠశాల ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

# పదేళ్లలో బీఆర్ఎస్ చేయలేని ఎన్నో అభివృద్ధి పనులను వెయ్యి రోజుల్లో చేపట్టాం

## నారాయణఖేడ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనపై సంబరాలు

**హైదరాబాద్ పల్స్ న్యూస్, సెప్టెంబర్ 05, నారాయణఖేడ్:** కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా నారాయణఖేడ్ మున్సిపల్ పట్టణంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ సంబరాలు, ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జహీరాబాద్ పార్లమెంట్ సభ్యుడు సురేష్ కుమార్ శేట్కర్, నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి, పట్లోళ్ల చంద్రశేఖర్ రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.స్థానిక ఎమ్మెల్యే స్వగృహం నుంచి రాజీవ్ గాంధీ చౌరస్తా వరకు కాంగ్రెస్ కార్యకర్తలతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తరువాత ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే సంజీవరెడ్డి ప్రసంగించారు.గత బీఆర్ఎస్ పాలనలో నారాయణఖేడ్ నియోజకవర్గ అభివృద్ధిని విస్మరించారని సంజీవరెడ్డి ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్నామని తెలిపారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో చేయలేని అనేక అభివృద్ధి పనులను కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల్లో చేపట్టిందని పేర్కొన్నారు.బీఆర్ఎస్ ప్రభుత్వం గతంలో ప్రజలకు ఇచ్చిన పలు హామీలను అమలు చేయలేదని ఎమ్మెల్యే విమర్శించారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, రైతు రుణమాఫీ, ఇంటికో ఉద్యోగం, దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తామనే



హామీ, కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య, దళితులకు మూడెకరాల భూమి, ముస్లింలు, గిరిజనులకు 12 శాతం రిజర్వేషన్ల వంటి హామీలను నెరవేర్చలేదని ఆరోపించారు.గత ప్రభుత్వం రాష్ట్రాన్ని భారీ అప్పుల భారం మధ్యకు నెట్టిందని, దాని ప్రభావం ప్రస్తుత ప్రభుత్వంపై పడిందని సంజీవరెడ్డి అన్నారు.

**నారాయణఖేడ్‌కు 3,500 ఇందిరమ్మ ఇళ్లు**

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నారాయణఖేడ్ నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ప్రతి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంతో పండుగ వాతావరణం నెలకొందని, త్వరలో రెండో విడత ఇళ్లను కూడా మంజూరు చేస్తామని చెప్పారు.బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో నారాయణఖేడ్ నియోజకవర్గానికి ఎన్ని ఇళ్లు మంజూరు చేశారో ఆ పార్టీ నాయకులు ప్రజలకు వివరించాలని ప్రశ్నించారు.

**ఉచిత విద్యుత్, కొత్త రేషన్ కార్డులు**

కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఎమ్మెల్యే వివరించారు. అర్హులైన కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని, కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయడంతోపాటు లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని తెలిపారు.200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.10 లక్షల ఆరోగ్యశ్రీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్ వంటి హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిందని పేర్కొన్నారు.

**రూ.200 కోట్లతో సమీకృత గురుకుల పాఠశాల**

నారాయణఖేడ్ నియోజకవర్గంలో రూ.200 కోట్ల అంచనా వ్యయంతో సమీకృత నివాస పాఠశాల, రూ.47 కోట్లతో ఏటీసీ కేంద్రం, రూ.5 కోట్లతో పట్టణ అటవీ ఉద్యానవనం, ఇండోర్, అవుట్‌డోర్ క్రీడా మైదానాల వంటి అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నామని సంజీవరెడ్డి తెలిపారు.రైతులకు ఇచ్చిన హామీ మేరకు రూ.21 వేల కోట్లతో 25 లక్షల మంది రైతులకు ఏకకాలంలో రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని అన్నారు.బీఆర్ఎస్ పదేళ్లలో చేయలేని పనులను కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల్లో చేపడుతుండటాన్ని మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి జీర్ణించుకోలేక విమర్శలు చేస్తున్నారని సంజీవరెడ్డి వ్యాఖ్యానించారు.గత పాలన, ప్రస్తుత పాలనను ప్రజలు బేరీజు వేసుకుంటున్నారని, ఇటీవల జరిగిన ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ప్రజలు తగిన సమాధానం చెప్పారని పేర్కొన్నారు.కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, సర్పంచులు, మాజీ సర్పంచులు, మున్సిపల్ కౌన్సిలర్లు, యువజన కాంగ్రెస్ నాయకులు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జిల్లా స్థాయి ఉత్తమ ప్రధానోపాధ్యాయ అవార్డుకు బి. రాజ్‌కుమార్

## ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్థుల అభినందనలు



**న్యాల్కల్, సెప్టెంబర్ 05 (హైదరాబాద్ పల్స్ న్యూస్):**

సంగారెడ్డి జిల్లా స్థాయి ఉత్తమ ప్రధానోపాధ్యాయ అవార్డుకు (హెచ్ఎం (గ్రేడ్--II) ఎంపికైన బి. రాజ్‌కుమార్‌కు ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్థులు అభినందనలు తెలిపారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారులు, కలెక్టరేట్ ప్రతినిధుల చేతుల మీదుగా ఆయన అవార్డును అందుకున్నారు.విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తూ, వారితో స్నేహపూర్వకంగా మెలుగుతూ విద్యాబోధనలో అంకితభావంతో పనిచేస్తున్నారని ఉపాధ్యాయులు తెలిపారు. పాఠశాల అభివృద్ధితో పాటు విద్యార్థుల విద్యా ప్రగతికి ఆయన చేస్తున్న కృషి ప్రశంసనీయమని పేర్కొన్నారు.అదేవిధంగా బోధన, బోధనేతర సిబ్బందితో స్నేహపూర్వకంగా ఉంటూ పాఠశాలలో సమన్వయంతో కూడిన వాతావరణాన్ని కొనసాగిస్తున్నారని తెలిపారు. ప్రధానోపాధ్యాయుడిగా వృత్తిపట్ల నిబద్ధత, బాధ్యతాయుతమైన విధానంతో పనిచేస్తూ విద్యా రంగంలో తనదైన గుర్తింపు పొందారని పేర్కొన్నారు.ఉత్తమ ప్రధానోపాధ్యాయ అవార్డుకు ఎంపిక కావడం పట్ల పాఠశాల బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు, మీర్జాపూర్-బి గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ బి. రాజ్‌కుమార్‌కు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

# గాంధీ చూపిన అహింసా మార్గం ప్రపంచానికే మార్గదర్శకం: ప్రభుత్వ విప్ రామచంద్రనాయక్

## డోర్నకల్‌లో వైభవంగా గాంధీజీ మాసోత్సవాల ప్రారంభం.
## పోస్టర్లు, కరపత్రాలు ఆవిష్కరించిన ఎమ్మెల్యే, ఫౌండేషన్ ప్రతినిధులు.
## రాష్ట్రవ్యాప్తంగా వ్యాసరచన పోటీలు..
## అక్టోబర్ 2న విజేతలకు బహుమతులు

**మహబూబాబాద్ (హైదరాబాద్ పల్స్, సెప్టెంబర్ 05):**

మహాత్మా గాంధీ చూపిన అహింస, శాంతి మార్గాలు నేటి ప్రపంచ దేశాలకే మార్గదర్శకమని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, డోర్నకల్ శాసనసభ్యులు డాక్టర్ రామచంద్రనాయక్ పేర్కొన్నారు. ప్రస్తుత యాంత్రిక జీవన పరిస్థితుల్లో గాంధీయిజం ఆవశ్యకత ఎంతైనా ఉందని ఆయన ఉద్ఘాటించారు.గాంధీ రీసెర్చ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న 'గాంధీజీ మాసోత్సవాల' కార్యక్రమాలను శనివారం డోర్నకల్ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో ఆయన లాంఛనంగా ప్రారంభించారు. సెప్టెంబర్ 2 నుండి అక్టోబర్ 2 వరకు రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థుల్లో గాంధీజీ సిద్ధాంతాలు, ఆలోచనలను విస్తృతంగా ప్రచారం చేసేందుకు రూపొందించిన పోస్టర్లు, కరపత్రాలను ఈ సందర్భంగా ఆవిష్కరించారు.

**శాంతియుత మార్గంలోనే విజయాలు**

అనంతరం ఎమ్మెల్యే డాక్టర్ రామచంద్రనాయక్ మాట్లాడుతూ.. "భారత స్వాతంత్ర్య సంగ్రామం నుంచి ఇటీవల సాధించుకున్న ప్రత్యేక తెలంగాణ




ఉద్యమం వరకు ప్రజలు అహింసాయుత, శాంతియుత మార్గాల్లోనే పోరాడి విజయాలను సాధించారు. ప్రపంచవ్యాప్తంగా జరిగే అనేక ప్రజా ఉద్యమాలకు మహాత్మా గాంధీ భావజాలమే ఆదర్శంగా నిలిచింది" అని తెలిపారు.

**మానవతా విలువల పెంపొందేలా విద్యార్థులకు మార్గనిర్దేశం**

గాంధీ రీసెర్చ్ ఫౌండేషన్ రాష్ట్ర కన్వీనర్, ప్రముఖ సైకాలజిస్ట్ డాక్టర్ పరికిపండ్ల అశోక్ మాట్లాడుతూ.. ఆధునిక కాలంలో హింసా ప్రవృత్తి, నేరాలు, ఆత్మహత్యలు పెరుగుతుండటం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నత సాంస్కృతిక చరిత్ర కలిగిన మన దేశంలో సమాజం సరైన దిశలో పయనించాలంటే మూల విలువలను గుర్తుచేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. గత 20 ఏళ్లుగా ఈ మాసోత్సవాల ద్వారా యువతలో సానుకూల ఆలోచనలు రేకెత్తిస్తున్నామని తెలిపారు.

**పోటీల్లో విజేతలకు కలెక్టర్ల చేతుల మీదుగా బహుమతులు**

ఈ మాసోత్సవాల సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రతి జిల్లాలో 'ప్రపంచ శాంతి-గాంధీ మార్గం' అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. విజేతలకు అక్టోబర్ 2న గాంధీ జయంతి వేడుకల్లో ఆయా జిల్లాల కలెక్టర్ల చేతుల మీదుగా బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమాన్ని విద్యాశాఖ అధికారులు, మేధావులు, ప్రజలు సహకరించి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డోర్నకల్ మండల అధికారులు, ప్రజాప్రతినిధులతో పాటు గాంధీ రీసెర్చ్ ఫౌండేషన్ ప్రతినిధులు సహజ, సైదా నాయక్, ధారావత్ జలంధర్, సీనియర్ జర్నలిస్టు అయోధ్య రామయ్య, బానోత్ సతీష్, మధు తదితరులు పాల్గొన్నారు.

# మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం చేసిన సర్పంచ్ బొడ్డు భాస్కర్



హైదరాబాద్ పల్స్ న్యూస్, సెప్టెంబర్ 05, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : యాదాద్రి భువనగిరి జిల్లా,రాజపేట మండలం కుర్రారం గ్రామానికి చెందిన వాటర్ మ్యాన్ మేడి మల్లయ్య అనారోగ్యంతో మృతి చెందారు, వారి కుటుంబానికి కుర్రారం సర్పంచ్ బొడ్డు భాస్కర్ 5000 రూపాయల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రావి కొండల్ రెడ్డి, ఎర్రగుంట ప్రభాకర్, మేడి శ్రీనివాసులు, బసవయ్య గౌడ్, బసవరాజు గౌడ్, కత్తుల అంజిరెడ్డి, పాండవుల లింగయ్య, ఎర్రగుంట బాల నరసయ్య, మేడి ఆనంద్, వల్లూరి మహేందర్, ఎర్రగుంట సుదర్శన్, ఊట్కూరి రవీందర్ తదితరులు పాల్గొన్నారు

# భువనగిరి సమగ్ర అభివృద్ధికి రూ.270 కోట్లు మంజూరు చేయండి

## సీఎం రేవంత్ రెడ్డికి భువనగిరి పట్టణ మున్సిపల్ చైర్మన్ తంగళ్లపల్లి శ్రీవాణి రవికుమార్ వినతి

**హైదరాబాద్ పల్స్ న్యూస్, సెప్టెంబర్ 05, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** యాదాద్రి-భువనగిరి జిల్లా, కేంద్రమైన భువనగిరి పట్టణాన్ని రాష్ట్రంలోనే మోడల్ అర్బన్ సెంటర్ గా తీర్చిదిద్దేందుకు రూ.270 కోట్ల నిధులు, 50 మంది అదనపు పారిశుద్ధ్య కార్మికులను మంజూరు చేయాలని కోరుతూ భువనగిరి పట్టణ మున్సిపల్ చైర్మన్ తంగళ్లపల్లి శ్రీవాణి రవికుమార్ నకిరేకల్ లో జరిగిన భారీ బహిరంగ సభకు విచ్చేసిన, తెలంగాణ ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా చైర్మన్ తన వినతిపత్రంలో పేర్కొన్న వివరాలు... భువనగిరి పట్టణం చారిత్రక భువనగిరి కోటకు ప్రసిద్ధి చెందిందని, దీనిని పశ్చిమ చాళుక్య రాజు త్రిభువనమల్ల విక్రమాదిత్య నిర్మించారని, తరువాత కాకతీయుల కాలంలో మరింత ప్రాశస్త్యం పొందిందని తెలిపారు. 1952లో మున్సిపాలిటీగా ఏర్పడిన భువనగిరి 2019లో రాయిగిరి, పాగిడిపల్లి, బొమ్మాయిపల్లి గ్రామాల విలీనంతో 76.537 చ.కి.మీ విస్తరించిందని, హైదరాబాద్ కు 48 కి.మీ, ప్రపంచ ప్రసిద్ధ యాదాద్రి లక్ష్మీ నరసింహ స్వామి ఆలయానికి 13 కి.మీ దూరంలో ఉందని, ప్రస్తుత జనాభా 78 వేలకు చేరిందని పేర్కొన్నారు.యాదాద్రి టెంపుల్ కారిడార్, ఇండస్ట్రియల్ కారిడార్, పెరుగుతున్న జనాభాతో పట్టణంపై భారం రెట్టింపు అయిందని, మౌలిక వసతులు, పారిశుద్ధ్యం, తాగునీరు, డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాల్సిన అవసరం ఉందని



వివరించారు.

**సీఎంకు సమర్పించిన ప్రధాన డిమాండ్లు:**

పారిశుద్ధ్య విభాగానికి 50 మంది అదనపు సిబ్బంది

ప్రస్తుతం మున్సిపాలిటీ పరిధి 28.05 చ.కి.మీ, 35 వార్డులకు కేవలం 208 మంది పారిశుద్ధ్య కార్మికులే ఉన్నారని, రోజూ పెరుగుతున్న చెత్త ఉత్పత్తి, ఇంటింటి చెత్త సేకరణ, డ్రైన్ డీ సిల్టింగ్, రోడ్ల ఊడ్పు, చెత్త తరలింపు రెండు షిఫ్టులలో చేయడం సాధ్యం కావడం లేదని, దీంతో 100% పారిశుద్ధ్యం సాధించలేక ప్రజారోగ్యం, స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకింగ్ దెబ్బతింటోందని తెలిపారు. అదనపు 50 మంది అవుట్ సోర్సింగ్ కార్మికులను మంజూరు చేయాలని, వారి వేతనాలను మున్సిపాలిటీ సాధారణ నిధుల నుండే భరిస్తామని హామీ ఇచ్చారు.

**సమగ్ర అభివృద్ధికి రూ.270 కోట్ల గ్రాంట్లు**

**పౌర సౌకర్యాల మెరుగుదలకు రూ.20 కోట్లు**

పట్టణంలోని అన్ని వార్డులలో సీసీ రోడ్లు వేయడం, ఆధునిక ఎల్ఈడి వీధి దీపాలు ఏర్పాటు, పారిశుద్ధ్యం, తాగునీటి మౌలిక వసతుల అప్ గ్రేడేషన్ ద్వారా ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించడానికి.

**శాశ్వత తాగునీటి పరిష్కారానికి రూ.50 కోట్లు**

హెచ్ఎండబ్ల్యూఎస్, ఎస్.బి సానికిపురి నుండి భువనగిరి మున్సిపాలిటీకి ప్రత్యేక అంకితమైన మంచినీటి పైప్ లైన్ నెట్ వర్క్ ఏర్పాటు ద్వారా ప్రస్తుత 5.50 కే.ఎల్.డి నీటి సరఫరాను 10.00 కే.ఎల్.డి కి పెంచి పట్టణ ప్రజలందరికీ నిరంతర, నమ్మకమైన తాగునీటిని అందించడానికి.

**అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థకు రూ.200 కోట్లు**

ప్రస్తుతం ఉన్న ఓపెన్ డ్రైనేజీల స్థానంలో ఆధునిక, పరిశుభ్రమైన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నెట్ వర్క్ ను ఏర్పాటు చేయడం ద్వారా వర్షాకాలంలో నీరు నిలవడం, వరదలు రాకుండా నివారించి, ప్రజారోగ్యాన్ని కాపాడి, పట్టణ పర్యావరణాన్ని మెరుగుపరచడానికి.మీ దూరదృష్టి నాయకత్వంలో భువనగిరిని క్లీన్ & గ్రీన్ భువనగిరిగా, స్వచ్ఛ తెలంగాణలో ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు ఈ నిధులు, సిబ్బందిని త్వరగా మంజూరు చేయాలని భువనగిరి పట్టణ మున్సిపల్ చైర్మన్ తంగళ్లపల్లి శ్రీవాణి రవికుమార్ ముఖ్యమంత్రిని వినతిపత్రంలో కోరారు.ఈ కార్యక్రమంలో భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి, భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి, టీపీసీసీ సభ్యులు తంగళ్లపల్లి రవికుమార్, యాదగిరిగుట్ట మాజీ ఎంపీపీ చిరక శ్రీశైలం లతో కలిసి భువనగిరి పట్టణ మున్సిపల్ చైర్మన్ తంగళ్లపల్లి శ్రీవాణి రవికుమార్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని శాలువాతో ఘనంగా సన్మానించారు

# దేవాలయ అభివృద్ధికి సహకరించడం అభినందనీయం

## సొంత నిధులతో ఎల్లమ్మ తల్లి దేవాలయానికి టైల్స్ అందించిన నాగాయపల్లి మల్లేష్



**హైదరాబాద్ పల్స్ న్యూస్, సెప్టెంబర్ 05, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** యాదాద్రి భువనగిరి జిల్లా, తుర్కపల్లి మండలంలోని గంధమల్ల గ్రామంలో ఎల్లమ్మ తల్లి దేవాలయ నిర్మాణానికి గ్రామానికి చెందిన నాగాయపల్లి మల్లేష్ తన సొంత నిధులతో టైల్స్ అందించడం అభినందనీయమని ఆత్మ కమిటీ డైరెక్టర్ జింకల ఎల్లేష్ యాదవ్ అన్నారు.హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నప్పటికీ తన స్వగ్రామంపై ఉన్న మమకారంతో గంధమల్ల గ్రామంలోని ఎల్లమ్మ తల్లి దేవాలయ అభివృద్ధికి తన వంతు సహకారం అందించడం ఎంతో హర్షణీయమని ఆయన పేర్కొన్నారు. దేవాలయ నిర్మాణానికి అవసరమైన టైల్స్‌ను సొంత ఖర్చులతో సమకూర్చి అందించడం ద్వారా మల్లేష్ తన సేవాభావాన్ని చాటుకున్నారని తెలిపారు.గ్రామంలో దేవాలయాల అభివృద్ధికి, ఆధ్యాత్మిక కార్యక్రమాలకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని జింకల ఎల్లేష్ యాదవ్ కోరారు. దేవాలయ నిర్మాణానికి సహకరించిన నాగాయపల్లి మల్లేష్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు, అభినందనలు తెలిపారు.



# తెలంగాణ అమరవీరుల స్మారక స్థూపం నిర్మాణానికి స్థలం కేటాయించాలని వినతి

**తెలంగాణ రాష్ట్ర ఉద్యమ కారుల సంఘం యాదాద్రి భువనగిరి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఎరుకల వెంకటేష్ గౌడ్**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, సెప్టెంబర్ 05, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి** : యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండల కేంద్రంలో తెలంగాణ అమర వీరుల స్మారక స్థూపం నిర్మాణం కోసం స్థలం కేటాయించాలని తహశీల్దార్ రవికుమార్ కు శనివారశీ నాడు వినతి పత్రం అందజేయడం జరిగిందని తెలంగాణ రాష్ట ఉద్యమ కారుల సంఘం యాదాద్రి భువనగిరి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఎరుకల వెంకటేష్ గౌడ్ తెలిపారు. ఉద్యమ కారుల సంఘం తుర్కపల్లి మండల అధ్యక్షుడు కోట సురేష్, అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధనలో అమరులైన వారిని గౌరవించి స్మరించుకునేందుకు తుర్కపల్లి మండల కేంద్రంలోని తెలంగాణ తల్లి చౌరస్తాలో అమరవీరుల స్మారక స్తూపం నిర్మాణంకు స్తలం కేటాయించి అమరుల త్యాగాలను గౌరవించాలని కోరారు ఈ కార్యక్రమంలో ఉద్యమ కారుల సంఘం తుర్కపల్లి మండల ప్రధాన కార్యదర్శి భూక్యా రమేష్ నాయక్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చందర్ నాయక్, తెలంగాణ ఉద్యమ కారులు గిరిజన సర్పంచ్ ల ఫోరం రాష్ట అధ్యక్షుడు భూక్యా సంతోష్ నాయక్, సింగిల్ విండో డైరెక్టర్ మోత్కుపల్లి రవి తదితరులు ఉన్నారు

# ఛలో ఇందిరా పార్క్ ధర్నాకు సంఘీభావం : భానుక నర్మదా మల్లికార్జున్

**ధర్నాకు భారీగా తరలివెళ్లిన బాధితులు, బీజేపీ కార్యకర్తలు**

**22-ఏ నిషేధిత జాబితా నుంచి భూములను తొలగించాలని డిమాండ్**



**సికింద్రాబాద్, సెప్టెంబర్ 05 (హైదరాబాద్ పల్స్ ప్రతినిధి):** భూ భారతి నిబంధనల పేరుతో భూములను 22-ఏ నిషేధిత జాబితాలో చేర్చడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలకు మద్దతుగా నిర్వహించిన చలో ఇందిరా పార్క్ ధర్నాకు సికింద్రాబాద్ కంటోన్మెంట్ నుంచి బాధితులు, ప్రజలు, బీజేపీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివెళ్లి సంఘీభావం తెలిపారు. కంటోన్మెంట్ నామినేటెడ్ సభ్యురాలు బానుక నర్మదా మల్లికార్జున్ నేతృత్వంలో బాధితులు, బీజేపీ కార్యకర్తలు ట్యాంక్‌బండ్‌లోని ధర్నా చౌక్‌కు చేరుకుని నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. గత 30 నుంచి 40 ఏళ్లుగా ఆయా ప్రాంతాల్లో నివాసం ఉంటున్న ప్రజలు భూ భారతి నిబంధనల కారణంగా అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని వారు తెలిపారు. ముఖ్యంగా నివాసాలు, భూములపై హక్కులు, రిజిస్ట్రేషన్లు తదితర అంశాల్లో ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఏళ్ల తరబడి నివాసం ఉంటున్న ప్రజల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని బానుక నర్మదా మల్లికార్జున్ డిమాండ్ చేశారు. ప్రజల భూములను 22-ఏ నిషేధిత జాబితాలో చేర్చిన అంశంపై పునఃపరిశీలన జరిపి బాధితులకు న్యాయం చేయాలని కోరారు. బాధితులకు న్యాయం జరిగే వరకు వారి తరఫున పోరాటం కొనసాగిస్తామని ఆమె తెలిపారు.

# ధ్రువ్ క్లినిక్ ప్రారంభోత్సవంలో ముద్దం నర్సింహ యాదవ్

**మల్లికార్జున కాలనీలో నూతనంగా ఏర్పాటు**





**సెప్టెంబర్ 05, ఓల్డ్ బోయిన్పల్లి (హైదరాబాద్ పల్స్ ప్రతినిధి):** ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్‌లోని మల్లికార్జున కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన ధ్రువ్ క్లినిక్‌ను ఓల్డ్ బోయిన్‌పల్లి మాజీ కార్పొరేటర్ ముద్దం నర్సింహ యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా క్లినిక్ యజమానులు డాక్టర్ శ్వేత, రమేష్ రెడ్డికి శుభాకాంక్షలు తెలియజేశారు. మల్లికార్జున కాలనీతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు స్థానికంగానే అందుబాటులోకి రావడం సంతోషకరమన్నారు. ధ్రువ్ క్లినిక్ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తూ మరింత అభివృద్ధి చెందాలని ముద్దం నర్సింహ యాదవ్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో విజయ్ కుమార్,లచ్చాగౌడ్ పాల్గొని క్లినిక్ నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు.

# జేఎన్టీయూహెచ్‌లో విద్యార్థులపై దాడులు.. ఎస్పీఎఫ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని ఆందోళన

**క్యాంపస్‌లో ప్రశాంత వాతావరణాన్ని దెబ్బతీస్తున్నారంటూ విద్యార్థుల ఆగ్రహం**

**ఘటనపై స్పందించిన రిజిస్ట్రార్ జయలక్ష్మి.. తగిన చర్యలు తీసుకుంటామని హామీ**

**కూకట్పల్లి (హైదరాబాద్ పల్స్, సెప్టెంబర్ 05):** కూకట్పల్లిలోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ (జేఎన్టీయూహెచ్) క్యాంపస్‌లో విద్యార్థులపై జరిగిన దాడి కలకలం రేపింది. స్టూడెంట్ ప్రొటెక్షన్ ఫోరమ్ (ఎస్పీఎఫ్) సభ్యులు అమాయక విద్యార్థులపై దాడికి పాల్పడడాన్ని నిరసిస్తూ శనివారం విద్యార్థులు పెద్దఎత్తున ఆందోళన నిర్వహించారు. శుక్రవారం ఎస్పీఎఫ్‌కు చెందిన కొందరు సభ్యులు మద్యం మత్తులో గూండాల మాదిరిగా తమపై దాడి చేశారని విద్యార్థులు ఆరోపించారు. గతంలోనూ ఇలాంటి వివాదాలకు పాల్పడిన కొందరిపై హాస్టల్, కాలేజీల నుంచి సస్పెన్షన్ వేటు వేసినప్పటికీ వారి తీరు మారలేదని వాపోయారు. వీరి చర్యల వల్ల అమాయక విద్యార్థులు అనవసర వివాదాల్లో, కేసుల్లో ఇరుక్కోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. యూనివర్సిటీ అడ్మినిస్ట్రేషన్ తగిన స్థాయిలో స్పందించకపోవడం వల్లే ఇలాంటి ఘటనలు పునరావృతం అవుతున్నాయని మండిపడ్డారు.

**రిజిస్ట్రార్‌ను కలిసి వినతి..**

విద్యార్థుల ఆందోళన నేపథ్యంలో జేఎన్టీయూహెచ్ రిజిస్ట్రార్ జయలక్ష్మి, ప్రిన్సిపల్ వెంటనే స్పందించి విద్యార్థులతో సమావేశమయ్యారు. వారి సమస్యలను, ఆందోళనలను వివరంగా అడిగి తెలుసుకున్నారు. గత రెండేళ్లుగా ఎస్పీఎఫ్ పేరుతో కొందరు వ్యక్తులు క్యాంపస్‌లో అశాంతి సృష్టిస్తున్నారని, మద్యం సేవించి విచక్షణారహితంగా దాడులకు పాల్పడుతున్నారని విద్యార్థులు రిజిస్ట్రార్ దృష్టికి తీసుకెళ్లారు. ఇలాంటి వారిని తక్షణమే క్యాంపస్ నుంచి బహిష్కరించి, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల ఆందోళనపై స్పందించిన రిజిస్ట్రార్ జయలక్ష్మి.. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. క్యాంపస్‌లో విద్యార్థుల భద్రతను, విశ్వవిద్యాలయ ప్రతిష్టను కాపాడేందుకు యాజమాన్యం కట్టుబడి ఉంటుందని స్పష్టం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో దుర్గా, జయరాం, సన్నీ, ఉదయ్, నవదీప్, నవీన్, చక్రి, సాయిరాం, మనీష్ తదితర విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# వినాయక నవరాత్రోత్సవాలు భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలి

**ఉత్సవాలకు మున్సిపాలిటీ తరపున అన్ని ఏర్పాట్లు చేస్తాం**

**మున్సిపల్ చైర్మన్ తంగళ్లపల్లి శ్రీవాణి రవి కుమార్**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, సెప్టెంబర్ 05, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి** : భువనగిరి పట్టణంలో వినాయక నవరాత్రోత్సవాలను భక్తిశ్రద్ధలతో, ఐక్యమత్యంగా, శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని భువనగిరి మున్సిపల్ చైర్మన్ తంగళ్లపల్లి శ్రీవాణి రవి కుమార్ విజ్ఞప్తి చేశారు. భువనగిరి గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో స్థానిక గార్డెన్ లో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... భువనగిరి పట్టణంలో వినాయక ఉత్సవాలు ప్రతి ఏటా అంగరంగ వైభవంగా జరుగుతాయని, ఈ ఏడాది కూడా అదే స్ఫూర్తితో భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని పిలుపునిచ్చారు. వినాయక చవితి ఉత్సవాల నిర్వహణకు, 9 రోజుల పాటు జరిగే పూజా కార్యక్రమాలకు, చివరి రోజు నిమజ్జనానికి మున్సిపాలిటీ తరపున ఎలాంటి లోటు లేకుండా అన్ని ఏర్పాట్లు చేస్తామని హామీ ఇచ్చారు. పట్టణంలో ఏర్పాటు చేసే ప్రతి వినాయక మండపం వద్ద లైటింగ్, పారిశుద్ధ్యం, తాగునీటి సౌకర్యం కల్పిస్తామని, ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా, నిమజ్జనం రోజు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా భువనగిరి గణేష్ ఉత్సవ కమిటీ నూతన అధ్యక్షునిగా పసుపునూరి నాగభూషణం ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం భువనగిరి పట్టణ మున్సిపల్ చైర్మన్ తంగళ్లపల్లి శ్రీవాణి రవి కుమార్ మరియు గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు నూతన అధ్యక్షులు పసుపునూరి నాగభూషణం ని శాలువాతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు తంగళ్లపల్లి రవి కుమార్ మాట్లాడుతూ, నూతన అధ్యక్షులు నాగభూషణం ఆధ్వర్యంలో ఉత్సవాలు మరింత ఘనంగా జరగాలని ఆకాంక్షించారు. యువత భక్తి భావంతో ఉత్సవాలను నిర్వహించాలని, మట్టి వినాయకులనే వాడాలని సూచించారు. ఈ సమావేశంలో గణేష్ ఉత్సవ సమితి నాయకులు తాడేం పాండు, పూస శ్రీను, దేవరకొండ నరసింహచారి, సూర్వి శ్రీనివాస్ గౌడ్, కూర శివకుమార్, ఉడుత భాస్కర్, కోటి రమేష్, యేదుగని సంతోష్ గణేష్ తదితరులు మరియు పట్టణంలోని వివిధ వినాయక ఉత్సవ కమిటీల సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




# ఉపాధ్యాయుల సేవలు సమాజ నిర్మాణానికి పునాది

**లిటిల్ మైండ్స్ హైస్కూల్‌లో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు**

**సెప్టెంబర్ 05 (హైదరాబాద్ పల్స్, మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి):** డోర్నకల్ మండలం చిలుకోడు గ్రామంలోని లిటిల్ మైండ్స్ హైస్కూల్‌లో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ గోగుల మల్సూర్, కరస్పాండెంట్ మహేశ్వరి ఆధ్వర్యంలో శనివారం జరిగిన కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ఉపాధ్యాయుల పట్ల తమ గౌరవాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల గొప్పతనాన్ని, విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దడంలో వారి పాత్రను వివరించారు. విద్యార్థులకు పాఠ్యాంశాలను బోధించడంతో పాటు క్రమశిక్షణ, నైతిక విలువలు, బాధ్యతాయుతమైన ప్రవర్తన, సమాజం పట్ల అవగాహన కల్పించడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. విద్యార్థులు ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ పూలు అందించి తమ అభిమానాన్ని వ్యక్తం చేశారు. పలువురు విద్యార్థులు ఉపాధ్యాయ దినోత్సవ ప్రాధాన్యతపై ప్రసంగించారు. గురువుల మార్గదర్శకత్వంతోనే విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించి భవిష్యత్తులో మంచి పౌరులుగా ఎదగగలరని కార్యక్రమంలో పేర్కొన్నారు. భారత మాజీ రాష్ట్రపతి, ప్రముఖ తత్వవేత్త, విద్యావేత్త డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 5న ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తున్న ఉపాధ్యాయుల సేవలను ఈ సందర్భంగా కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.




# 22-ఏ నిషేధిత జాబితా నుంచి కాలనీలను తొలగించాలి

**అల్వాల్ నుంచి ఇందిరాపార్క్‌కు బీజేపీ శ్రేణులు, కాలనీ వాసుల తరలింపు**

**అల్వాల్, సెప్టెంబర్ 05 (హైదరాబాద్ పల్స్ ప్రతినిధి):** 22-ఏ నిషేధిత జాబితాలో చేరిన నివాస ప్రాంతాలను తొలగించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ రాష్ట్ర పార్టీ ఆధ్వర్యంలో ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద నిర్వహించిన నిరసన దీక్షకు అల్వాల్ నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చింతల మాణిక్యా రెడ్డి నేతృత్వంలో అల్వాల్ నుంచి బస్సులు, కార్లలో పార్టీ శ్రేణులు, వివిధ కాలనీల ప్రతినిధులు ఇందిరాపార్క్‌కు చేరుకుని నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. అల్వాల్ సర్కిల్ పరిధిలోని వేణుగోపాల్‌నగర్, మంగాపురం కాలనీ, ఆనంద్‌రావునగర్, జానకీనగర్, వాసవినగర్, రామ్‌నగర్‌తో పాటు మచ్చబొల్లారం, అల్వాల్, వెంకటాపురం డివిజన్ల పరిధిలోని పలు కాలనీలకు సంబంధించిన భూములు 22-ఏ నిషేధిత జాబితాలో ఉండటంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బీజేపీ నాయకులు తెలిపారు. కొన్ని సర్వే నంబర్లలోని పరిమిత భూభాగాలకు సంబంధించిన సమస్యలను కారణంగా చూపుతూ మొత్తం కాలనీలను నిషేధిత జాబితాలో చేర్చడం వల్ల ఇళ్ల యజమానులు, స్థిరాస్తి కొనుగోలుదారులు, మధ్యతరగతి కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని వారు పేర్కొన్నారు. పాత అల్వాల్, దమ్మాయిగూడ ప్రాంతాల్లోని సర్వే నంబర్లు 52, 55కు సంబంధించి హెచ్ఎండబ్ల్యూఎస్, రైల్వే, హట్ రిజిస్ట్రేషన్ తదితర అంశాలు ఉన్నప్పటికీ వాటి ప్రభావం మొత్తం ప్రాంతాలపై పడుతోందని నాయకులు ఆరోపించారు. ఇటీవల మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ పత్రాలు, ఆధారాలతో వచ్చిన 22-ఏ ఫిర్యాదులను పరిశీలించి, అర్హత ఉన్న ఆస్తులను నిషేధిత జాబితా నుంచి తొలగించే అంశాన్ని పరిశీలిస్తామని హామీ ఇచ్చినట్లు బీజేపీ నాయకులు తెలిపారు. ఈ నేపథ్యంలో వాస్తవంగా ఎలాంటి వివాదాలు లేని కాలనీలను కూడా సమగ్రంగా పరిశీలించి 22-ఏ జాబితా నుంచి తొలగించాలని వారు డిమాండ్ చేశారు. ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద కాలనీ ప్రతినిధులు తమ సమస్యలను ఎంపీ ఈటల రాజేందర్ దృష్టికి తీసుకెళ్లి వినతిపత్రాలు అందజేశారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని ఆయన హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీనివాస్ వర్మ, డివిజన్ అధ్యక్షులు అజయ్ రెడ్డి, కార్తీక్ గౌడ్, శ్రీధర్ రెడ్డి, మల్లికార్జున్ గౌడ్, సుజాత, ఉదయ్ ప్రకాశ్, రాజిరెడ్డి, సూర్య, గోపి, లక్ష్మణ్, విజయ్ మండ, అనిల్ తదితరులు, పలువురు కాలనీ ప్రతినిధులు, స్థానికులు పాల్గొన్నారు. 22-ఏ నిషేధిత జాబితా నుంచి తమ కాలనీలను తొలగించాలని డిమాండ్ చేస్తూ నిరసనకారులు నినాదాలు చేశారు. సమస్య పరిష్కారమయ్యే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని బీజేపీ నాయకులు స్పష్టం చేశారు.








# పటాన్‌చెరు జడ్పీహెచ్ఎస్‌లో పోలీసుల ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవం

## విద్యార్థులకు మాదకద్రవ్యాలు, రోడ్డు భద్రత, సైబర్ నేరాలపై అవగాహన

**పటాన్‌చెరు, సెప్టెంబర్ 05 (హైదరాబాద్ పల్స్ న్యూస్):**
ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు పటాన్‌చెరు పోలీసులు పటాన్‌చెరు పట్టణంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ, సీఐ ఎం. రవీందర్, ఎస్ఐ (పరిపాలన) ఎం. మహేశ్వర్ రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ వీరమణి, పోలీస్ సిబ్బంది పాఠశాలను సందర్శించి విద్యార్థులు, ఉపాధ్యాయులతో మమేకమయ్యారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను సన్మానించి, విద్యార్థులకు విద్యాబోధనతో పాటు సమాజానికి బాధ్యతాయుతమైన పౌరులను అందించడంలో వారు చేస్తున్న సేవలను అభినందించారు.అనంతరం విద్యార్థుల భద్రత, భవిష్యత్తుకు సంబంధించిన పలు



అంశాలపై పోలీసులు అవగాహన కల్పించారు. ముఖ్యంగా మాదకద్రవ్యాల దుర్వినియోగం, నివారణ చర్యలు, రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలు, సైబర్ నేరాలు, ఆన్‌లైన్ భద్రత, మహిళలు, బాలల భద్రత తదితర అంశాలను వివరించారు.సామాజిక మాధ్యమాలు, ఇతర డిజిటల్ వేదికలను వినియోగించే సమయంలో అప్రమత్తంగా ఉండాలని, వ్యక్తిగత సమాచారాన్ని తెలియని వ్యక్తులతో పంచుకోవద్దని పోలీసులు సూచించారు. రోడ్డు భద్రతా నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు.ఎవరైనా బెదిరింపులు, వేధింపులు లేదా అనుమానాస్పద కార్యకలాపాలకు గురైతే భయపడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.విద్యార్థుల్లో భద్రతపై అవగాహన పెంపొందించడం, పోలీసులు--ప్రజల మధ్య సత్సంబంధాలను బలోపేతం చేయడం, యువతతో పోలీసు శాఖకు సానుకూలమైన సంబంధాన్ని ఏర్పరచడం కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పోలీసులు తెలిపారు.ఈ సందర్భంగా విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని, విద్యపై దృష్టి సారించి భవిష్యత్తులో బాధ్యతాయుతమైన, చట్టాలను గౌరవించే పౌరులుగా ఎదగాలని పోలీసు అధికారులు సూచించారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ తరపున ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలిపారు

# లష్కరే తోయిబా టాప్ కమాండర్ యాసిర్ హతం!

**జమ్మూకశ్మీర్‌లోని యూస్‌మార్గ్ అడవుల్లో హోరాహోరీ ఎన్‌కౌంటర్.**

**రక్తపాతానికి ప్లాన్ చేస్తుండగా మట్టుబెట్టిన భారత భద్రతా బలగాలు.**

**సెంట్రల్ డెస్క్, సెప్టెంబర్ 05 (హైదరాబాద్ పల్స్ న్యూస్):**
జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదుల ఏరివేత లక్ష్యంగా సాగుతున్న ఆపరేషన్లలో భారత భద్రతా బలగాలు మరో భారీ విజయాన్ని సాధించాయి. పాకిస్థాన్‌కు చెందిన లష్కరే తోయిబా టాప్ కమాండర్, మోస్ట్ వాంటెడ్ టెర్రరిస్ట్ యాసిర్‌ను శనివారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో సైన్యం విజయవంతంగా మట్టుబెట్టింది.

**పక్కా సమాచారంతో మెరుపు దాడి**

మధ్య కశ్మీర్‌లోని బద్గామ్ జిల్లా, యూస్‌మార్గ్ ఎత్తైన అటవీ ప్రాంతంలో అనుమానాస్పదంగా ఉగ్రవాదులు సంచరిస్తున్నట్లు భద్రతా సంస్థలకు పక్కా సమాచారం అందింది. దీంతో రంగంలోకి దిగిన ఇండియన్ ఆర్మీకి చెందిన 53 రాష్ట్రీయ రైఫిల్స్, స్పెషల్ ఫోర్సెస్ బలగాలు సంయుక్తంగా గాలింపు చర్యలు చేపట్టాయి. దట్టమైన అటవీ ప్రాంతంలో బలగాలను చూసిన ఉగ్రవాదులు ఒక్కసారిగా కాల్పులకు తెగబడటంతో, సైన్యం తక్షణమే ప్రతిదాడికి దిగింది. ఇరుపక్షాల మధ్య తీవ్రస్థాయిలో జరిగిన ఈ కాల్పుల్లో లష్కర్ కమాండర్ యాసిర్ అక్కడికక్కడే హతమయ్యాడు.

**సొంతంగా నెట్‌వర్క్ నడుపుతున్న యాసిర్**

విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. హతమైన యాసిర్ పాకిస్థాన్ నుండి అక్రమంగా భారత్‌లోకి చొరబడిన రికార్డెడ్ ఉగ్రవాది. గతంలో లష్కరే తోయిబాకు చెందిన కీలకమైన 'సులేమాన్ మూసా' ముఠాలో పనిచేసిన ఇతడు, గత ఏడాది కాలంగా ఆ గ్రూప్ నుండి విడిపోయి సొంతంగా నెట్‌వర్క్ నడుపుతున్నాడు. యూస్‌మార్గ్, బద్గామ్ పరిసర ప్రాంతాల్లో స్థానిక యువతను ఉగ్రవాదం వైపు రేకెత్తిస్తూ లోయలో మళ్లీ రక్తపాతం సృష్టించేందుకు ప్రణాళికలు రచిస్తుండగా బలగాలు అతడిని అంతమొందించాయి.

**కొనసాగుతున్న జల్లెడ**

యాసిర్ అంతంతో ఈ ప్రాంతంలో లష్కరే తోయిబాకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. స్థానికంగా అతనికి సహకరించిన నెట్‌వర్క్ ఎవరు, ఇటీవలి కాలంలో కశ్మీర్‌లో జరిగిన దాడుల్లో అతడి పాత్ర ఎంతవరకు ఉందనే అంశాలపై భద్రతా సంస్థలు విచారణను వేగవంతం చేశాయి. కశ్మీర్ వ్యాప్తంగా గాలింపు చర్యలను మరింత తీవ్రతరం చేసినట్లు అధికారులు వెల్లడించారు



# గురువులకు గౌరవం..విద్యార్థులకు చేయూత!

## దూలపల్లి ప్రభుత్వ పాఠశాలలో ప్లేట్ల పంపిణీ

**దూలపల్లి, సెప్టెంబర్ 05 (హైదరాబాద్ పల్స్ ప్రతినిధి):**
ఉపాధ్యాయుల దినోత్సవాన్ని పురస్కరించుకుని దూలపల్లి ప్రభుత్వ పాఠశాలలో బీఆర్ఎస్ నాయకుడు మంత్రి రఘునాథ్ సేవా కార్యక్రమం నిర్వహించారు. తన తాతయ్య మంత్రి ఎల్లయ్య, నానమ్మ కృష్ణమ్మ జ్ఞాపకార్థంగా పాఠశాల విద్యార్థులకు ప్లేట్లను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మంత్రి రఘునాథ్ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే గురువులను గౌరవించడంతో పాటు, వారు బోధించే విద్యార్థులకు అవసరమైన సదుపాయాలు కల్పించడం కూడా మన బాధ్యత అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద, మధ్యతరగతి విద్యార్థులకు తనవంతు సహకారం అందిస్తానని తెలిపారు. గురువుల సేవలను స్మరించుకునే ఉపాధ్యాయుల దినోత్సవం రోజున విద్యార్థులకు ఉపయోగపడే వస్తువులను అందించడం ఆనందంగా ఉందన్నారు. పిల్లల కోసం చేసే ప్రతి చిన్న సహాయం వారి భవిష్యత్తుకు పెద్ద అండగా నిలుస్తుందని పేర్కొన్నారు.ప్లేట్ల పంపిణీతో విద్యార్థులకు మధ్యాహ్న భోజన సమయంలో ఎంతో సౌకర్యం కలగనుందని పాఠశాల ఉపాధ్యాయులు తెలిపారు. ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా సేవా కార్యక్రమాన్ని చేపట్టిన మంత్రి రఘునాథ్ ను పాఠశాల సిబ్బంది, స్థానికులు అభినందించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు వేణుగోపాల్, విద్యార్థులు, బీఆర్ఎస్



నాయకులు మాజీ వైస్ చైర్మన్ గంగయ్య నాయక్ , మాజీ కౌన్సిలర్ డప్పు కిరణ్, మల్లేష్, పెంటయ్య,రాజు, మహేష్, మధు, జీతేందర్, నాగరాజు, రంజిత్, బాలాజీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# వినాయక మండపాల నిర్మాణాలు–రహదారుల దిగ్బంధాలు

**మండపాల ఏర్పాటుపై అధికారులు దృష్టి సారించాలి**

**వాహనదారులు, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలి**

**ఓల్డ్ బోయిన్పల్లి, సెప్టెంబర్ 05 (హైదరాబాద్ పల్స్ ప్రతినిధి):**
గణేష్ నవరాత్రుల సందర్భంగా మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్, బోయిన్పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్న వినాయక మండపాలపై మున్సిపల్, పోలీసు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు. మండపాల నిర్మాణం పేరుతో ప్రధాన రహదారులను పూర్తిగా మూసివేయడం వల్ల వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు పేర్కొంటున్నారు.వినాయక మండపాల ఏర్పాటుకు అనుమతులు ఇచ్చే సమయంలో అత్యవసర వాహనాలతో పాటు కనీసం ద్విచక్ర వాహనాలు రాకపోకలు సాగించేలా రహదారిలో తగినంత స్థలం ఉండేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. రహదారులను పూర్తిగా దిగ్బంధం చేసే మండపాలకు అనుమతులు ఇవ్వకుండా నిబంధనలను కఠినంగా అమలు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.ఓల్డ్ బోయిన్పల్లి డివిజన్ 262 పరిధిలోని కళింగ ఎన్‌క్లేవ్ హైటెన్షన్ రోడ్డులో వినాయక మండపం ఏర్పాటుకు తాత్కాలిక నిర్మాణం చేపట్టి సుమారు 11 రోజుల పాటు రహదారిని దిగ్బంధం చేయనున్న నేపథ్యంలో అధికారులు ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.అదేవిధంగా 262, 264 డివిజన్ల పరిధిలో ఏర్పాటు చేస్తున్న వినాయక మండపాల వద్ద తాత్కాలిక నిర్మాణాలు, విద్యుత్ దీపాల ఏర్పాటు, అధిక శబ్దంతో పాటలు, డీజే వినియోగం తదితర అంశాల్లో ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలు పాటించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.భక్తుల పండుగకు ఎలాంటి ఆటంకం లేకుండా, అదే సమయంలో ప్రజలు, వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా మండపాల నిర్వాహకులు సహకరించాలని స్థానికులు విజ్ఞప్తి చేశారు. ఈ అంశంపై మల్కాజ్‌గిరి మున్సిపల్ అధికారులు, బోయిన్పల్లి పోలీసులు తక్షణమే స్పందించి తగిన చర్యలు చేపట్టాలని హైదరాబాద్ పల్స్ జాతీయ తెలుగు దినపత్రిక ద్వారా కోరుతున్నారు.





# గురువులను గౌరవించడం ప్రతి విద్యార్థి బాధ్యత

## ప్రెజెంటేషన్ హైస్కూల్‌లో ఘనంగా స్వయం పాలన, ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

**అల్వాల్, సెప్టెంబర్ 05 (హైదరాబాద్ పల్స్ ప్రతినిధి):**
చేర్యాల ప్రెజెంటేషన్ హైస్కూల్‌లో విద్యార్థుల ఆధ్వర్యంలో స్వయం పాలన దినోత్సవం, ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల మేనేజర్ రెవ. సిస్టర్ ధన్యా జోసెఫ్, ప్రిన్సిపాల్ రెవ. సిస్టర్ జ్యోతి ఆధ్వర్యంలో కార్యక్రమాలు ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి.స్వయం పాలన దినోత్సవంలో భాగంగా విద్యార్థులు ఉపాధ్యాయుల పాత్రలను స్వీకరించి తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల బాధ్యతలు, క్రమశిక్షణ, సమయపాలన, విద్యార్థుల పట్ల వారి బాధ్యతలను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. ఉపాధ్యాయులుగా వ్యవహరిస్తూ విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించారు.అనంతరం ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులు తమ గురువులకు శుభాకాంక్షలు తెలిపారు. ఉపాధ్యాయుల సేవలను కొనియాడుతూ వారి పట్ల గౌరవం, కృతజ్ఞతను వ్యక్తం చేశారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించి వేడుకలను ఉత్సాహంగా జరుపుకున్నారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సిస్టర్ జ్యోతి మాట్లాడుతూ విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. గురువులను గౌరవించడం ప్రతి విద్యార్థి బాధ్యత అని పేర్కొన్నారు.మేనేజర్ సిస్టర్ ధన్యా జోసెఫ్ విద్యార్థుల ప్రతిభను అభినందించారు. విద్యార్థులు బాధ్యతాయుతమైన నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఓల్డ్ బోయిన్పల్లి బిజెపి పార్టీ నేతల ఛలో ఇందిరపార్క్

## రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏనుగుల తిరుపతి ఆధ్వర్యంలో దీక్షకు సంఘీభావం



**సెప్టెంబర్ 05, ఓల్డ్ బోయినపల్లి (హైదరాబాద్ పల్స్ ప్రతినిధి):**
బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు సూచన మేరకు, మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ మరియు శాసనసభ పక్షనేత నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో ఇందిరా పార్క్ వేదికగా కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన జీవో 22ఏ బాధితుల పక్షాన చేస్తున్న నిరసన కార్యక్రమంలో ఓల్డ్ బోయినపల్లి బీజేపీ పార్టీ తరఫున బీజేపీ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొనడానికి ఓల్డ్ బోయినపల్లి బీజేపీ పార్టీ కార్యాలయం నుండి బైక్ ర్యాలీగా ప్రారంభమై హస్మాత్ పేట్ చౌరస్తా వద్ద ఉన్న డాక్టర్ బి. ఆర్.అంబేద్కర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులు అర్పించి ఛలో ఇందిరా పార్క్ నిరసన దీక్షకు బయలుదేరారు. ఈ సందర్భంగా ఏనుగుల తిరుపతి హైదరాబాద్ పల్స్ తెలుగు జాతీయ పత్రికతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చి ప్రజలను ఇబ్బందులు పెడుతున్నారని, నిరుపేదలే లక్ష్యంగా రేవంత్ రెడ్డి పాలన కొనసాగుతుందని ఇది ప్రజా పాలన కాకుండా ప్రజలను ఇబ్బంది పెట్టె పాలనగా ఏనుగుల తిరుపతి అభివర్ణించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని గద్దె దించే వరకు బీజేపీ పార్టీ కార్యకర్తలుగా మేము కృషి చేస్తామని వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏనుగుల తిరుపతి, సీనియర్ నాయకులు రవి, మనోజ్, నల్లోల శేఖర్, అర్జీత్ సింగ్, తేజ, రమేష్, బబ్లు, గిరీష్ తదితరులు నిరసన దీక్ష మద్దతుగా తరలి వెళ్లారు.

# కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

**హైదరాబాద్ పల్స్ న్యూస్, సెప్టెంబర్ 05, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :**



భువనగిరి పట్టణంలో కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో శనివారం ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్ర పటానికి పూలమలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా విద్యార్థుల ఉపన్యాసాలు, నృత్య ప్రదర్శన, పాటలు అందరినీ ఆకట్టుకున్నాయి. ప్రిన్సిపాల్ రఘు అఖిల మాట్లాడుతూ... టీచర్ పిల్లలకు మార్కులు కాదు, నమ్మకం ఇస్తారని అన్నారు. ప్రతి విజయం వెనుక ఒక ఉపాధ్యాయులు కష్టం ఉంటుందని చెప్పారు. చదువతో పాటు మంచి ప్రవర్తన, క్రమశిక్షణ నేర్పడమే స్కూల్ లక్ష్యమని తెలిపారు.ఈ కార్యక్రమంలో టీచర్లు, సిబ్బంది, విద్యార్థులు , తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ప్రజల విశ్వాసమే కాంగ్రెస్‌కు బలం

**వెయ్యి రోజుల పాలనలో సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యం**
**డోర్నకల్ మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు డాక్టర్ బత్తుల శ్రీనివాస్ యాదవ్..**



**హైదరాబాద్ పల్స్, సెప్టెంబర్ 05, మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి**
ప్రజల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని డోర్నకల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు డాక్టర్ బత్తుల శ్రీనివాస్ యాదవ్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల ప్రజా పాలనను పురస్కరించుకుని శనివారం డోర్నకల్ మండల కేంద్రంలోని జైన్ భవన్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ రైతులు, పేదలు, మహిళలు, యువతతో పాటు సమాజంలోని అన్ని వర్గాల అభివృద్ధికి ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతోందన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి సంక్షేమ పథకాలను అమలు చేయడంతో పాటు అభివృద్ధి పనులకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. తెలంగాణలో అన్ని వర్గాలు, మతాల ప్రజలను సమానంగా గౌరవిస్తూ వారి సంప్రదాయాలు, సంస్కృతికి ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. పండుగల నిర్వహణతో పాటు ఆలయాల అభివృద్ధికి కూడా తగిన ప్రాధాన్యత కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. వెయ్యి రోజుల ప్రజా పాలన ఒక సంఖ్య మాత్రమే కాదని, ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావడానికి ప్రభుత్వం చేస్తున్న కృషికి నిదర్శనమని అన్నారు. డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రామచందర్ నాయక్ ఆధ్వర్యంలో నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపించేందుకు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు కృషి చేస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో డోర్నకల్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కాల సుమీర్ జైన్, మున్సిపల్ చైర్మన్ రాజకుమారీ హరిబాబు, వైస్ చైర్మన్ మాధ లావణ్య శ్రీనివాస్, జిల్లా, మండల నాయకులు, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, గ్రామ పార్టీ అధ్యక్షులు, సర్పంచులు, వార్డు సభ్యులు, యువజన నాయకులు, కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.




## యూనిటీ పీజీ కళాశాలలో గ్రాడ్యుయేట్ టు బిజినెస్ లీడర్" వర్క్ షాప్

**హైదరాబాద్ పల్స్ న్యూస్, సెప్టెంబర్ 05, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** భువనగిరి మండల పరిధిలోని రాయగిరి గ్రామంలో గల యూనిటీ పీజీ కళాశాలలో ద్వితీయ సంవత్సర విద్యార్థులకు "థింక్ లైక్ ఏ సీఈఓ ఫ్రమ్ ఎంబీఏ గ్రాడ్యుయేట్ టు బిజినెస్ లీడర్" వర్క్ షాప్ ను ఘనంగా నిర్వహించారు .ఈ వర్క్ షాప్ లో ఎంబీఏ విద్యార్థులలో వ్యాపార దృక్పథం, నాయకత్వ లక్షణాలు, వ్యూహాత్మక ఆలోచన విధానం, నిర్ణయాలు తీసుకునే సామర్థ్యాన్ని పెంపొందిస్తాయని ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తగా వచ్చిన జేఎన్టీయూ ఎంబీఏ ప్రొఫెసర్ సంతోషి పవర్ పేర్కొన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో సీఈఓ ఎలా ఆలోచించాలి, ప్రపంచ స్థాయి నాయకులుగా ఎలా ఎదగాలి, నూతన వ్యాపార ప్రక్రియలను, డిజిటల్ టెక్నాలజీ, ఇన్నోవేషన్, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ మరియు నిర్వహణ గురించి కళాశాల చైర్మన్ ప్రభాకర్ వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయుల దినోత్సవాన్ని పురస్కరించుకొని కొన్ని ప్రసంగాలు, సంస్కృతిక కార్యక్రమాలు మరియు వివిధ వినోద కార్యక్రమాల ద్వారా ఉపాధ్యాయుల పట్ల తమ అభిమానాన్ని వ్యక్తపరిచారు. ఈ కార్యక్రమంలో యూనిటీ గ్రూప్ ఆఫ్ కాలేజెస్ చైర్మన్ ఏ ప్రభాకర్ రెడ్డి డైరెక్టర్లు సోమ చందు, పి.గోవర్ధన్ రెడ్డి యూనిటీ పీజీ కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎంఎస్ సరిత యూనిటీ ఫార్మసీ కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ అంపటి శ్రీనివాస్, ఏవోపి సునీత, హెచ్వోడి జి.సురేష్ ఉపాధ్యాయ బృందం వి.రాధ వి.యమునా, సంపత్ కుమార్, పి.లతా, ఖలీల్ పాషా, సబియా, ముస్తఫా, వాణి మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం చేసిన భీమగోని సంతోష్ గౌడ్



**హైదరాబాద్ పల్స్ న్యూస్, సెప్టెంబర్ 05, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** యాదాద్రి భువనగిరి జిల్లా, ఆలేరు మండలం కొలనుపాక గ్రామంలోని మామిండ్ల వెంకటేష్ కుటుంబాన్ని పరామర్శించి, 5000 రూపాయలు ఆర్థిక సహాయం అందజేసిన భీమగోని ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు భీమగోని సంతోష్ గౌడ్, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... అతి చిన్న వయసులో చనిపోవడం చాలా బాధాకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో భీమగోని రామచంద్రం గౌడ్, సారయ్య గౌడ్, రాము గౌడ్, తలారి యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

# గుమ్మడిదలలో ఘనంగా రైతు సదస్సు

**రైతుల సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తాం: బీఆర్ఎస్ నాయకులు**



**గుమ్మడిదల, సెప్టెంబర్ 05 (హైదరాబాద్ పల్స్ న్యూస్):**
రైతుల సమస్యల పరిష్కారంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని బీఆర్ఎస్ నాయకులు విమర్శించారు. రైతులకు ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. రైతుల హక్కులు, సంక్షేమం కోసం బీఆర్ఎస్ నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు.గుమ్మడిదలలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు సదస్సులో మాజీ ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ ఆదర్శ్ రెడ్డి, ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రస్తుత వ్యవసాయ పరిస్థితులు, ప్రభుత్వ విధానాలపై చర్చించారు.బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతుబంధు, రైతు బీమా, వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్ వంటి పథకాల ద్వారా రైతులకు భరోసా కల్పించామని నాయకులు పేర్కొన్నారు.ప్రస్తుత ప్రభుత్వం రైతు బీమాను సకాలంలో పునరుద్ధరించకపోవడం, రైతుబంధు సాయాన్ని సక్రమంగా అందించకపోవడం, హామీ ఇచ్చిన రూ.2 లక్షల రైతు రుణమాఫీని పూర్తిస్థాయిలో అమలు చేయకపోవడం వల్ల రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు ఆరోపించారు.రైతుల సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ రైతుల తరఫున గళం వినిపిస్తూ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తుందని నాయకులు తెలిపారు. రైతులకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఉద్యోగ విరమణ పొందిన హోంగార్డులకు ఆత్మీయ వీడ్కోలు

**ఘనంగా సత్కరించిన రామగుండం పోలీస్ కమిషనర్**

**గోదావరిఖని, సెప్టెంబర్ 05 (హైదరాబాద్ పల్స్ ప్రతినిధి):**
రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో పోలీసు శాఖలో సుమారు 35 సంవత్సరాలపాటు హోంగార్డులుగా సేవలందించి ఉద్యోగ విరమణ పొందుతున్న ఇద్దరు హోంగార్డులకు పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు.మంచిర్యాల జిల్లా పరిధిలో హోంగార్డు నంబర్ 256గా విధులు నిర్వహించిన జె. రామయ్య, గోదావరిఖని, పెద్దపల్లి జిల్లా పరిధిలో హోంగార్డు నంబర్ 249గా సేవలందించిన పి. సత్తయ్య ఉద్యోగ విరమణ సందర్భంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఇద్దరినీ పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. పోలీసు శాఖలో సుదీర్ఘకాలం అందించిన సేవలను అభినందించారు. ఉద్యోగ విరమణ అనంతరం వారి జీవితం ఆరోగ్యంగా, ఆనందంగా, సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో అదనపు డీసీపీ (అడ్మిన్) కె. శ్రీనివాస్, ఏఆర్ ఏసీపీ ప్రతాప్, హోంగార్డ్స్ ఆర్ఐ పెద్దన్న, పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు వి. నవీన్ కుమార్, ఉపాధ్యక్షుడు ఎన్. శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్ ఎం. తిరుపతి, ప్రధాన కార్యదర్శి జె. అంజనేయులు, సంయుక్త కార్యదర్శి కె. ఓంకార్, సంఘం సభ్యులు, హోంగార్డ్స్ ఇన్‌చార్జీలు తదితరులు పాల్గొన్నారు.




# డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఒకరికి 7 రోజుల జైలు

**15 మందికి రూ.41,500 జరిమానా.. ప్రభుత్వ ఆసుపత్రిలో పారిశుద్ధ్య పనులు**

**గోదావరిఖని, సెప్టెంబర్ 05 (హైదరాబాద్ పల్స్ ప్రతినిధి):**
మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారిపై రామగుండం ట్రాఫిక్ పోలీసులు చర్యలు చేపట్టారు. ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ బి. రాజేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన 16 మందిని గోదావరిఖని ప్రిన్సిపల్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ వెంకట సచిన్ రెడ్డి ఎదుట హాజరుపరిచారు.వారిలో 15 మందికి న్యాయస్థానం మొత్తం రూ.41,500 జరిమానా విధించింది. అదనంగా సామాజిక సేవలో భాగంగా స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో పారిశుద్ధ్య పనులు చేయించారు. మరో వ్యక్తికి ఏడు రోజుల జైలు శిక్ష విధించగా, అతడిని కరీంనగర్ జిల్లా జైలుకు తరలించారు.ఈ సందర్భంగా ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ బి. రాజేశ్వరరావు మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల ప్రమాదాల ముప్పు పెరుగుతుందని తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.వాహనదారులు వాహనాలకు సంబంధించిన అన్ని ధ్రువపత్రాలను తప్పనిసరిగా కలిగి ఉండాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, రాంగ్‌రూట్‌లో ప్రయాణించకుండా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కోరారు. వాహనాలను అతివేగంగా నడపకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.




# కాంగ్రెస్ 1000 రోజుల దగా పాలనపై బీఆర్ఎస్ సమరభేరి

**పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలి, జాబ్ క్యాలెండర్ ప్రకటించాలి**
**యూత్ డిక్లరేషన్ హామీలు అమలు చేయాలి**
**మాజీ ప్రభుత్వ విప్, ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునిత మహేందర్ రెడ్డి**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, సెప్టెంబర్ 05, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల దగా పాలనను నిరసిస్తూ, పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని, పక్కాగా జాబ్ క్యాలెండర్ ప్రకటించాలని, యూత్ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మాజీ ప్రభుత్వ విప్, ఆలేరు మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇంచార్జ్ శ్రీమతి గొంగిడి సునిత మహేందర్ రెడ్డి ఆదేశానుసారం ఆలేరు నియోజకవర్గ కేంద్రంలో బీఆర్ఎస్ యువజన, విద్యార్థి విభాగాల ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా మాజీ ప్రభుత్వ విప్, ఆలేరు మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇంచార్జ్ శ్రీమతి గొంగిడి సునిత మహేందర్ రెడ్డి మాట్లాడుతూ... యువత, విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడకుండా ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని బీఆర్ఎస్ పార్టీ తరపున డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సుమారు 2,000 మంది యువజనులు, విద్యార్థులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ డీసీసీబీ చైర్మన్, టెస్కాబ్ మాజీ వైస్ చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డి, బి.ఆర్.ఎస్.వి రాష్ట్ర ఉపాధ్యక్షులు తుంగ బాలు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కల్లూరి రామచంద్ర రెడ్డి, అన్ని



మండలాల యూత్ అధ్యక్షులు, బి.ఆర్.ఎస్.వి అధ్యక్షులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.యువత, విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడకుండా ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని బీఆర్ఎస్ పార్టీ తరపున డిమాండ్ చేశారు.

# గురువులే విద్యార్థుల భవిష్యత్‌కు దిక్సూచులు

**సెయింట్ అగ్నేష్ హైస్కూల్‌లో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు**

**సెప్టెంబర్ 05 (హైదరాబాద్ పల్స్, మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి):** విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని చాటిచెప్పేలా డోర్నకల్ మండల కేంద్రంలోని సెయింట్ అగ్నేష్ హైస్కూల్‌లో శనివారం ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ గురువుల పట్ల ఉన్న గౌరవం, అభిమానాన్ని వివిధ కార్యక్రమాల ద్వారా వ్యక్తం చేశారు.కార్యక్రమానికి ముందుగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. రాధాకృష్ణన్ విద్యా రంగానికి అందించిన విశిష్ట సేవలను విద్యార్థులకు వివరించారు.ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ ఆంథోనీ, ప్రిన్సిపాల్ హెలెన్ రాణి మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి, వారిని ఉన్నత లక్ష్యాల వైపు నడిపించడంలో ఉపాధ్యాయుల బాధ్యత ఎంతో గొప్పదని అన్నారు. విద్యతో పాటు సంస్కారం, క్రమశిక్షణ, సేవాభావం వంటి విలువలను విద్యార్థులకు అందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. సమాజ అభివృద్ధికి విద్యావంతులైన యువతను తీర్చిదిద్దడమే ఉపాధ్యాయుల సేవకు నిజమైన గుర్తింపు అని తెలిపారు.అనంతరం



విద్యార్థులు ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలియజేసి, గురువుల పట్ల తమ కృతజ్ఞతను చాటుకున్నారు. పాఠశాల యాజమాన్యం తరపున ఉపాధ్యాయులను సన్మానించి ప్రత్యేక బహుమతులు అందజేశారు. దీంతో పాఠశాలలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# కామ్రేడ్ ఏనుగుల ఉదయ్ ప్రథమ వర్ధంతి సభ

**యవ్వన ప్రాయంలోనే భౌతికంగా దూరమవడం బాధాకరం, కుటుంబానికి, విప్లవోద్యమానికి తీరని లోటు**

**సీపీఐ ఎం.ఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఆర్.జనార్ధన్**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, సెప్టెంబర్ 05, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** యవ్వన ప్రాయంలోనే కామ్రేడ్ ఏనుగుల ఉదయ్ అనే నవ యువకుడు అకాల మరణం చెందడం ఎంతో బాధాకరమని, చూస్తుండగానే అమరుడయ్యి సంవత్సరం కావడంతో కుటుంబంతో పాటు, సీపీఐ ఎం.ఎల్ న్యూడెమోక్రసీ శ్రేణులు, గ్రామ ప్రజలు కామ్రేడ్ ఏనుగుల ఉదయ్ ని స్మరించుకున్నారని, ఏనుగుల ఉదయ్ లేని లోటు నిరంతరం గుర్తుకు వస్తుందని సీపీఐ ఎం.ఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఆర్.జనార్ధన్ అన్నారు. శనివారం నాడు యాదగిరిగుట్ట మండలం కమటం గూడెం లో కామ్రేడ్ ఏనుగుల ఉదయ్ ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆయన స్వగృహంలో ఉదయ్ మాతృ మూర్తి ఏనుగుల నర్సమ్మ,ఇద్దరు కూతుర్లు జ్యోతి, ఉమా, అల్లుళ్ళు మల్లిఖార్జున్, శ్రీనివాస్, సీపీఐ



ఎం.ఎల్ న్యూడెమోక్రసీ కార్యకర్తలు, నాయకులు ఉదయ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి, విప్లవ జోహార్లు తెలిపారు. అనంతరం జరిగిన సభలో జనార్ధన్ మాట్లాడుతూ... కామ్రేడ్ ఏనుగుల ఉదయ్ ప్రైవేట్ విద్యాసంస్థలలో చిన్న ఉద్యోగం చేస్తూ, తల్లి, భార్య, ఇద్దరు ఆడ పిల్లలను పోసించుకుంటున్న ఒక మంచి వాతావరణంలో ప్రాథమికంగా అనారోగ్యానికి గురయ్యారని హాస్పిటల్ లో మృతి చెందడంతో ఉదయ్ కుటుంబం అనేక ఇబ్బందులకు బెట్టబడ్డదని ఆవేదన వ్యక్తం చేశారు. కామ్రేడ్ ఉదయ్ తండ్రి అయినట్టి ఏనుగుల మోహనన్న కూడా 2015 లోనే అమరత్వం పొందడం జరిగిందని అన్నారు. ప్రస్తుతం మన ముందున్న వ్యవస్థ లో ఎలాంటి వాళ్ళనైనా ముఖ్యంగా,యువతను అమాంతం చెడు అలవాట్లకు, చెడు సంస్కృతికి,బానిస అలవాట్లకు గురిచేస్తుందని, మనిషిని మనిషి గౌరవించలేని ముఖ్యంగా మహిళలను, విద్యార్థినీలపై అత్యాచారాలు, హత్యలు జరుగుతున్న ఈ సమయంలో, సమాజానికి ఏమాత్రం కూడా ఉపయోగపడని విధంగా తయారవుతున్న పరిస్థితులలో కూడా కామ్రేడ్ ఏనుగుల ఉదయ్ ఎలాంటి చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ తన తండ్రి అడుగుజాడల్లో నడుస్తూ విప్లవ బావాలను అలవర్చుకున్నాడని గుర్తు చేశారు. కేంద్రంలో, రాష్ట్రంలో ఉన్న పాలకులు ప్రజలను వదిలేసి పూర్తిగా బడా కార్పోరేట్ సంస్థలకు, సామ్రాజ్యవాద శక్తులకు ఊడిగం చేస్తున్న పరిస్థితులు ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి ఇక్కిరి సహదేవ్, ఏ ఐ కె ఎం ఎస్ జిల్లా అధ్యక్షులు కల్లెపు అడివయ్య, జిల్లా ఉపాధ్యక్షులు మామిడాల బాల మల్లేష్, జిల్లా నాయకులు బర్మ బాబు, ఎలగందుల సిద్దులు, స్థానిక నాయకులు ఏనుగుల ఎల్లయ్య, తాడెం పాండు, ప్రజా సంఘాల నాయకులు ఇంజ శ్రీను, గడ్డం మంకయ్య, గడ్డం యాదగిరి, పాకాల నరేష్, మేకల వెంకటేష్, సుంచు రాములు, ఏనుగుల సత్యలక్ష్మి, ఏనుగుల రాములమ్మ, కందుకూరు అండాలు, మిట్ట మణెమ్మ తదితరులు పాల్గొన్నారు.

# విద్యాభివృద్ధికి విశేష కృషి.. పి.వి. రమణకు జిల్లా ఉత్తమ ఎంఈఓ అవార్డు

**విద్యా ప్రమాణాల పెంపు, విద్యార్థుల నమోదు పెంపులో కీలక సేవలు**

**చర్ల, సెప్టెంబర్ 05 (హైదరాబాద్ పల్స్ ప్రతినిధి):** ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని చర్ల మండల విద్యాధికారి పి.వి. రమణకు జిల్లా ఉత్తమ మండల విద్యాధికారి పురస్కారం లభించింది. కొత్తగూడెం జిల్లా కేంద్రంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో కొత్తగూడెం శాసనసభ్యుడు కూనంనేని సాంబశివరావు చేతుల మీదుగా పి.వి. రమణ అవార్డును అందుకున్నారు.విద్యాశాఖలో 37 సంవత్సరాలుగా అంకితభావంతో సేవలందిస్తున్న పి.వి. రమణ చర్ల మండలంలో విద్యా ప్రమాణాల పెంపు, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల మెరుగుదల, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంపు తదితర కార్యక్రమాల్లో కీలకంగా పనిచేశారు. ఆయన సేవలను గుర్తిస్తూ జిల్లా ఉత్తమ మండల విద్యాధికారిగా ఎంపిక చేశారు.చర్ల మండలంలోని పాఠశాలల్లో పదో తరగతి ఫలితాల మెరుగుదలకు ప్రత్యేక చర్యలు చేపట్టడంతో పాటు తెలంగాణ మోడల్ స్కూల్ ఏర్పాటులో కీలక పాత్ర పోషించారు. అభ్యసన సామర్థ్యాల మెరుగుదల కార్యక్రమంలో చర్ల మండలం జిల్లా స్థాయిలో రెండో స్థానం సాధించడంలో ఆయన నాయకత్వం వహించారు.పాఠశాలల్లో డిజిటల్ విద్యను ప్రోత్సహించడంతో పాటు ఎఫ్ఆర్ఎస్ ఆధారిత హాజరు విధానాన్ని సమర్థవంతంగా అమలు చేశారు. 'బడిబాట' వంటి కార్యక్రమాల ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంచి, మధ్యలో చదువు మానేసే విద్యార్థుల సంఖ్యను తగ్గించేందుకు కృషి చేశారు.ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, ఉపాధ్యాయులు, గ్రామస్థుల సహకారంతో మండలంలో విద్యాభివృద్ధికి పలు కార్యక్రమాలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు.ఈ సందర్భంగా పి.వి. రమణ మాట్లాడుతూ తనకు లభించిన ఈ పురస్కారం ఉపాధ్యాయులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థుల సమిష్టి



కృషికి దక్కిన గుర్తింపుగా భావిస్తున్నానన్నారు. రాబోయే రోజుల్లో చర్ల మండలాన్ని విద్యారంగంలో మరింత ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని తెలిపారు. జిల్లా ఉత్తమ మండల విద్యాధికారిగా పురస్కారం అందుకున్న పి.వి. రమణను మండల ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, స్థానికులు అభినందించారు.

# ఉపాధ్యాయుల దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

**హైదరాబాద్ పల్స్ న్యూస్, సెప్టెంబర్ 05, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** యాదాద్రి భువనగిరి జిల్లా, కలెక్టర్ కార్యాలయంలో భారతరత్న డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి పురస్కరించుకొని భువనగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ఉపాధ్యాయుల దినోత్సవ వేడుకల్లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య పాల్గొన్నారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి, డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో పాల్గొని ఉపాధ్యాయులను ఉద్దేశించి ప్రసంగించారు.ఈ సందర్భంగా శ్రీ బీర్ల ఐలయ్య మాట్లాడుతూ.. అధ్యాపకుడి స్థాయి నుంచి భారత రాష్ట్రపతిగా ఉన్నత శిఖరాలను అధిరోహించి, ఉపాధ్యాయ లోకానికి స్ఫూర్తిగా నిలిచిన భారతరత్న డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా, తమ జీవితాలను విద్యార్థుల భవిష్యత్తు కోసం అంకితం చేస్తున్న ఉపాధ్యాయులందరికీ హృదయపూర్వక ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.సమాజాన్ని మార్చే శక్తి రాజకీయాల్లో ఉంటే.. ఆ సమాజాన్ని సరైన మార్గంలో నడిపించే మహాశక్తి ఉపాధ్యాయుడి చేతిలో ఉంటుందని అన్నారు. ఒక విద్యార్థి భవిష్యత్తును తీర్చిదిద్దడం నుంచి ఒక సమాజం భవిష్యత్తును నిర్మించడం వరకు ఉపాధ్యాయుల పాత్ర ఎంతో గొప్పదని పేర్కొన్నారు. విద్య అనే ఆయుధంతో తరతరాల అజ్ఞానాన్ని పారద్రోలి, జ్ఞాన సమాజ నిర్మాణానికి పునాదులు వేసే ప్రతి గురువు నిజమైన దేశ నిర్మాత అని కొనియాడారు. తాము



కరిగిపోతూ ఇతరుల జీవితాల్లో వెలుగులు నింపే కొవ్వొత్తుల్లాంటి వారు మన ఉపాధ్యాయులు అని అన్నారు. ఎండనక, వాననక ఎన్నో కష్టనష్టాలను ఓర్చుకుంటూ గ్రామీణ ప్రాంతాల నుంచి నగరాల వరకు ప్రతి బిడ్డకు అక్షర జ్ఞానాన్ని అందిస్తూ, వారి భవిష్యత్తును తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయుల సేవలు వెలకట్టలేనివని అన్నారు.సమాజంలో నేడు మనం ఏ ఉన్నత పదవిలో ఉన్నా, ఎంత పేరు ప్రఖ్యాతులు సంపాదించినా.. ఆ ఎదుగుదల వెనుక మనకు ఓనమాలు నేర్పిన గురువుల కష్టం, ఆశీర్వాదం తప్పక ఉంటుందని బీర్ల ఐలయ్య పేర్కొన్నారు. విద్యార్థుల్లో క్రమశిక్షణ, విలువలు, జ్ఞానం, దేశభక్తి వంటి సద్గుణాలను పెంపొందించడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులు, ఉపాధ్యాయుల సంక్షేమానికి



ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం రూ.10 వేల కోట్ల మేర పెండింగ్ బిల్లులను మంజూరు చేసిందని చెప్పారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు హెల్త్ కార్డుల వంటి సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు.అదేవిధంగా ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రితో చర్చించి, పి.ఆర్.సి అమలు, సీపిఎస్ రద్దు వంటి అంశాలపై అసెంబ్లీలో గళం వినిపిస్తూ, ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాల న్యాయమైన డిమాండ్ల సాధనకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.భారతీయ తత్వశాస్త్ర గొప్పతనాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన ఆదర్శ గురువు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా, నిస్వార్థంగా విద్యా సేవలు అందిస్తున్న ఉపాధ్యాయ లోకానికి తన పాదాభివందనాలు తెలియజేస్తూ, ప్రతి ఉపాధ్యాయుడికి హృదయపూర్వక ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.



# గురువుల సేవలకు ఘన సత్కారం

**విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే శిల్పులు ఉపాధ్యాయులు**

**షాద్‌నగర్, సెప్టెంబర్ 05 (హైదరాబాద్ పల్స్ ప్రతినిధి):** సమాజానికి దిశానిర్దేశం చేసే ఉపాధ్యాయుల సేవలను గుర్తిస్తూ కోడిచర్ల తండా, కాజిగూడ తండాలకు చెందిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని కోడిచర్ల తండా గ్రామపంచాయతీ సర్పంచ్ శాంతి నాయక్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను శాలువాలతో సత్కరించి, పుష్పగుచ్ఛాలతో అభినందించారు.ఈ సందర్భంగా వార్డు సభ్యుడు బిచ్యా నాయక్ మాట్లాడుతూ తల్లిదండ్రులు జన్మనిస్తే గురువులు విద్యార్థుల జీవితానికి దిశానిర్దేశం చేస్తారని అన్నారు. గురువు బోధించే పాఠం ఒక విద్యార్థి జీవితాన్ని మార్చగలదని, ఆ విద్యార్థి భవిష్యత్తులో సమాజాన్ని మార్చగలడని పేర్కొన్నారు.విద్యార్థుల్లో జ్ఞానంతో పాటు క్రమశిక్షణ, నైతిక విలువలు, సామాజిక బాధ్యతలను పెంపొందిస్తూ భావితరాలకు బలమైన పునాది వేస్తున్న ఉపాధ్యాయుల సేవలు వెలకట్టలేనివని అన్నారు. గురువు ఒక వ్యక్తి మాత్రమే కాదని, ఒక తరాన్ని తీర్చిదిద్దే శక్తి అని కొనియాడారు. ఉపాధ్యాయుల గౌరవాన్ని కాపాడటం, వారి సేవలను గుర్తించడం సమాజం మొత్తం బాధ్యత అని పేర్కొన్నారు.కార్యక్రమంలో కోడిచర్ల తండా ప్రధానోపాధ్యాయురాలు సుహాసిని, అంగన్‌వాడీ టీచర్ లక్ష్మి, కాజిగూడ ఉపాధ్యాయులు, వార్డు సభ్యులు భాస్కర్ నాయక్, కాంగ్రెస్ ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు జైపాల్ నాయక్, గ్రామ కమిటీ అధ్యక్షుడు రాము నాయక్, మోహన్ నాయక్, బుగ్గ నాయక్, పంచాయతీ కార్యదర్శి రాజు, దేవ్య నాయక్, శ్రీహరి, వినోద్ నాయక్, కొర్ర గోవింద్ నాయక్, రవి నాయక్, విష్ణు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# తాజ్ పూర్ లో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు



**హైదరాబాద్ పల్స్ న్యూస్, సెప్టెంబర్ 05, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** యాదాద్రి భువనగిరి జిల్లా, భువనగిరి మండలం తాజ్ పూర్ గ్రామ మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో డా, సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి పురస్కరించుకొని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఉపాధ్యాయులను తాజ్ పూర్ సర్పంచ్ మరియు ఉపసర్పంచ్ పాలకవర్గ సభ్యులు అదేవిదంగా విద్యార్థినీ విద్యార్థులు పూలమాలలు శాలువాలతో సన్మానించారు.ఈ సందర్భంగా సర్పంచ్ ర్యాకల సంతోష శ్రీనివాస్ భారత మొదటి ఉపరాష్ట్రపతి, ద్వితీయ రాష్ట్రపతి గా పనిచేసిన గురువులు డా, సర్వేపల్లి రాధాకృష్ణన్ పుట్టినరోజు సందర్భంగా జరుపుకునే ఈ రోజును ఉద్దేశించి మాట్లాడుతూ... అజ్ఞానాన్ని తొలగించి విజ్ఞానాన్ని పంచి క్రమశిక్షణ ను అలవర్చి, జీవితాన్ని మలిచేది గురువులు అని, ఎగిరే గాలిపటం విద్యార్థి అయితే ఆధారమైన దారం గురువు అని, తల్లిదండ్రులు జన్మనిస్తే సరైన జీవితాన్ని ఇచ్చేది మాత్రం గురువులేనని, మీరంతా గురువుల పట్ల గౌరవంతో మెలుగుతూ విద్యనభ్యశించాలని, మన ఎదుగుదలనే గురుదక్షణగా భావించే గురువులందరికి మరొక్కసారి ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సామాజిక వేత్త డా, ర్యాకల శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు, ఉపసర్పంచ్ వరిగంటి కృష్ణ, వార్డు సభ్యులు పల్లెపాటి కృష్ణ, బొమ్మారపు లక్ష్మి బాలరాజు, బీట్కూరి మహేష్, వరిగంటి మానస నాగరాజు, షేక్ అహ్మద్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# భవిష్యత్తులో ఆపరేషన్ సింధూర్ ను ఎదుర్కొనేందుకు పాకిస్థాన్ మాస్టర్ ప్లాన్..?

**టర్కీ, సౌదీ అరేబియాతో రక్షణ ఒప్పందంపై ఆసక్తి**

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 05 (హైదరాబాద్ పల్స్ న్యూస్ ప్రతినిధి)** పాకిస్థాన్, సౌదీ అరేబియా, టర్కీ మధ్య ఆగస్టు 7న కుదిరిన మక్కా సంయుక్త రక్షణ ఒప్పందం అంతర్జాతీయంగా చర్చనీయాంశంగా మారింది. ఒప్పందం ప్రకారం మూడు దేశాల్లో ఏదైనా ఒకదానిపై సాయుధ దాడి జరిగితే, దాన్ని మిగతా దేశాలపై జరిగిన దాడిగా పరిగణించే నిబంధన ఉంది.ఈ నేపథ్యంలో భవిష్యత్తులో భారత్–పాకిస్థాన్ మధ్య ఘర్షణ తలెత్తితే టర్కీ, సౌదీ అరేబియా పాకిస్థాన్‌కు మద్దతు ఇస్తాయా అనే చర్చ సాగుతోంది. అయితే ఈ ఒప్పందం ఉగ్రవాద కార్యకలాపాలకు మద్దతు ఇవ్వడానికి ఉద్దేశించినదిగా భావించరాదని దౌత్య వర్గాలు పేర్కొంటున్నాయి.ఇప్పటికే మూడు దేశాలు రక్షణ సహకారాన్ని అమలు చేసే దిశగా చర్చలు ప్రారంభించాయి. ఈ ఒప్పందం భవిష్యత్తులో ప్రాంతీయ భద్రతా సమీకరణాలపై ఎలాంటి ప్రభావం చూపుతుందనేది ఆసక్తికరంగా మారింది.

